www.aashwi.net / in
PRGI NO. TGMUL/26/A2874

# ఆశ్వి అప్డేట్స్

AASHWI UPDATES ENGLISH I TELUGU I HINDI DAILY

గురువారం, 16-07-2026 | రంగారెడ్డి Rangareddy | సంపుటి : 01 Volume : 01 | సంచిక :77 Issue : 77 | పేజీలు :08 pages :08 | వెల : రూ.02 price : ₹.02 | www.aashwi.net/in

## నాలో బ్యాటింగ్ సామర్థ్యాన్ని వెలికి తీసింది ఆ ఇద్దరే: వాషింగ్టన్




7



## నీ వల్లే నాకు "అయ్యగారు" అనే పేరు వచ్చింది

8






# తెలంగాణలో అమెజాన్ భారీ పెట్టుబడి

- భారత్ ఫ్యూచర్ సిటీలో అమెజాన్ AWS డేటా సెంటర్‌కు శంకుస్థాపన
- తెలంగాణను ప్రపంచంలోనే అత్యుత్తమ పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే లక్ష్యం: సీఎం రేవంత్ రెడ్డి
- 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంగా ముందుకు

**రంగారెడ్డి, జూలై 15 (ఆశ్వి ప్రతినిధి):**

తెలంగాణను ప్రపంచంలోనే అత్యుత్తమ పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం భారత్ ఫ్యూచర్ సిటీలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ (AWS) డేటా సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో ప్రపంచ స్థాయి, కాలుష్యరహిత,

మిగతా 2వ పేజీలో..



## నెహ్రూ టు రాహుల్.. బీసీలకు మోసమే!

- నెహ్రూ కాలం నుంచి రాహుల్ గాంధీ వరకు కాంగ్రెస్ పార్టీ ఓబీసీలకు అడుగడుగునా ద్రోహం చేసింది.
- మెరిట్ దెబ్బతింటుందని నాడు ప్రధాని నెహ్రూ రిజర్వేషన్లను వ్యతిరేకించారు; ఆ లేఖ పార్లమెంట్ రికార్డుల్లోనే ఉంది.

**తెలంగాణ బ్యూరో, ఆశ్వి అప్డేట్స్:**

నెహ్రూ కాలం నుంచి నేటి రాహుల్ గాంధీ వరకు గాంధీ కుటుంబం, కాంగ్రెస్ పార్టీ ఓబీసీ (బీసీ) సామాజిక వర్గాలకు అడుగడుగునా ద్రోహం చేశాయని బీజేపీ స్టేట్ చీఫ్ ఎన్. రాంచందర్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. హైదరాబాద్‌లో ప్రముఖ రచయిత సూరవరం శ్రీనివాస్ రచించిన 'కాంగ్రెస్, గాంధీ కుటుంబం ఓబీసీలకు

మిగతా 3వ పేజీలో..

## ఆదిలాబాద్ సీసీఐని వెంటనే తెరవండి

- ఆదిలాబాద్ సీసీఐ ప్లాంట్ పునరుద్ధరణ కోసం కేంద్ర మంత్రి కుమారస్వామితో కేటీఆర్ బృందం భేటీ.
- ప్లాంట్ రీ-ఓపెనింగ్‌కు కేంద్రం సానుకూలం.. రూ.2 వేల కోట్లతో కొత్త ఫ్యాక్టరీకి కేంద్ర మంత్రి ప్రతిపాదన



2



## గతంలో మమ్మల్ని అడ్డుకున్నారు.. ఇప్పుడు జగన్‌కు పూర్తి స్వేచ్ఛనిస్తున్నాం: లోకేశ్

- ప్రొద్దుటూరు నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలతో లోకేశ్ సమావేశం
- జగన్ రాయలసీమ బిడ్డ కాదు.. సీమకు పట్టిన క్యాన్సర్ గడ్డ అని వ్యాఖ్యలు
- బ్రాహ్మణి స్టీల్స్, ఓబులాపురం దోపిడీతోనే సాక్షి మీడియా ఏర్పాటు అని ఆరోపణ
- వాళ్లు ఫ్యాక్షన్ తెస్తే.. మేం ఫ్యాక్టరీలు తెచ్చి ఉద్యోగాలిస్తున్నాం అని వెల్లడి
- ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నామని ఉద్ఘాటన

**ఆశ్వి అప్డేట్స్**

"గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబును ఇంటి నుంచి బయటకు రానీయకుండా గేట్లకు తాళాలు వేయించారు. కానీ ఈరోజు మేం జగన్ స్వేచ్ఛగా ఎక్కడికైనా వెళ్లేందుకు అనుమతిస్తున్నాం. ఇదే మాకూ, వారికీ ఉన్న తేడా" అని మంత్రి, టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ అన్నారు. బుధవారం ప్రొద్దుటూరు నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.
"జగన్ రాయలసీమ బిడ్డ కాదు, ఈ సీమకు పట్టిన క్యాన్సర్ గడ్డ" అని లోకేశ్ ఘాటుగా

మిగతా 2వ పేజీలో..

## తెలంగాణలో ఫుడ్ సేఫ్టీ - డ్రగ్ కంట్రోల్ విభాగాల విలీనానికి కసరత్తు

- సమన్వయం పెంచి, సిబ్బంది కొరతను తీర్చడం కోసం ఫుడ్ సేఫ్టీ, డ్రగ్ కంట్రోల్ శాఖల ఏకీకరణ.
- విలీనంతో ల్యాబ్ పరీక్షలు, శాంపిల్స్ సేకరణ, మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు మరింత వేగవంతం

2



## తెలంగాణలో 'ఎస్ఐఆర్' గడువు పొడిగింపు

- తెలంగాణ, కర్ణాటక సహా నాలుగు రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా సవరణ గడువు పొడిగింపు
- ఇంటింటి సర్వే కోసం బూత్ లెవల్ అధికారులకు అదనపు సమయం
- తెలంగాణలో ఆగస్టు 10న ముసాయిదా, అక్టోబర్ 12న తుది జాబితా

3




# తెలంగాణ కాంగ్రెస్‌లో నామినేటెడ్ పదవుల వేడి..

- 37 కార్పొరేషన్ చైర్మన్ల పదవీకాలం ముగియడంతో పాత నేతల తీవ్ర లాబీయింగ్.
- పనితీరు ఆధారంగా కొద్దిమందికే (సింగిల్ డిజిట్) పొడిగింపు ఇవ్వాలని సీఎం నిర్ణయం.
- పాతవి, కొత్తవి కలిపి ప్రస్తుతం రాష్ట్రంలో 50కి పైగా నామినేటెడ్ పదవులు ఖాళీ.
- సీనియర్లను పక్కనపెట్టి, తనకు అండగా ఉండే వలస నేతలకే పదవులివ్వాలని ముఖ్యనేత వ్యూహం

**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:**

కాంగ్రెస్‌లో నామినేటెడ్ పదవుల వ్యవహారం రాజకీయంగా మళ్లీ వేడెకింది. రాష్ట్రంలో రెండేండ్ల క్రితం నియమించిన కార్పొరేషన్ చైర్మన్ల పదవీకాలం ముగియడంతో రెన్యువల్ కోసం పాత చైర్మన్లు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తున్నది.
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో, 2024 జూలై 7న 37 రాష్ట్రస్థాయి

మిగతా 2వ పేజీలో..





## రెండేళ్లలో మరో 5 లక్షల మెట్రిక్ టన్నుల గోదాముల సామర్థ్యం: మంత్రి తుమ్మల

- రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 52 గోదాములు 104% ఆక్యుపెన్సీతో, 6.33 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వలతో పూర్తిగా నిండి ఉన్నాయి
- కొత్తగా నిర్మించే అన్ని గోదాములపై తప్పనిసరిగా సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి, రాబోయే 20 ఏళ్ల అవసరాలకు తగ్గట్టుగా అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించడం.

2

## తెలంగాణలో వింత వాతావరణం..

- రేపు 5 జిల్లాలకు ఉక్కపోత హెచ్చరిక!
- తెలంగాణలో జులై 22 వరకు పొడి వాతావరణం
- 5 జిల్లాల్లో వేడి, ఉక్కపోత ఉంటుందని ఐఎండీ హెచ్చరిక
- రాష్ట్రంలోని 28 జిల్లాల్లో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం
- పలు జిల్లాల్లో వర్షా భావం, హన్మకొండలో 65 శాతం లోటు నమోదు
- హైదరాబాద్‌లో 36 డిగ్రీల వరకు చేరనున్న గరిష్ఠ ఉష్ణోగ్రత

3

## 50 నామినేటెడ్ పదవులు ఈ నెలలోనే భర్తీ




- మంచి పనితీరు కనబరిచిన వారిని రెన్యువల్ చేస్తామన్న మహేశ్ గౌడ్
- పార్టీ పదవులపై మీనాక్షి నటరాజన్ తో చర్చించామని వెల్లడి
- మండల కమిటీలలో డీసీసీల రిపోర్ట్ ఫైనల్ అని స్పష్టీకరణ

2

# తెలంగాణలో ఫుడ్ సేఫ్టీ డ్రగ్ కంట్రోల్ విభాగాల విలీనానికి కసరత్తు

- **సమన్వయం పెంచి, సిబ్బంది కొరతను తీర్చడం కోసం ఫుడ్ సేఫ్టీ, డ్రగ్ కంట్రోల్ శాఖల ఏకీకరణ.**
- **విలీనంతో ల్యాబ్ పరీక్షలు, శాంపిల్స్ సేకరణ, మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు మరింత వేగవంతం.**
- **అధునాతన సాంకేతికతతో ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌ల సామర్థ్యం పెంపు, రీజనల్ ల్యాబ్‌ల ఏర్పాటు.**
- **కల్తీలపై కఠినంగా వ్యవహరిస్తూనే, నాణ్యమైన సేవలు అందించే వ్యాపారాలు, ఫార్మా రంగానికి భరోసా.**

**తెలంగాణ బ్యూరో, ఆశ్వ అప్డేట్స్:**



ప్రజారోగ్య పరిరక్షణను మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేస్తోంది. ప్రస్తుతం వేర్వేరుగా పనిచేస్తున్న ఫుడ్ సేఫ్టీ, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) విభాగాలను విలీనం (ఇంటిగ్రేట్) చేసేందుకు కసరత్తు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్రానికి అనువైన రీతిలో సమగ్ర కార్యాచరణ ప్రణాళికను (యాక్షన్ ప్లాన్) సిద్ధం చేయాలని ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తును ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. బుధవారం సచివాలయంలో రెండు విభాగాల బలోపేతంపై ఉన్నతాధికారులతో మంత్రి ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజలకు నాణ్యమైన ఆహారం, సురక్షితమైన ఔషధాలను అందించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత కఠినంగా వ్యవహరిస్తోందని స్పష్టం చేశారు. ఆహార భద్రతపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని, ప్రజారోగ్యానికి సంబంధించిన అంశాల్లో ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదని ఆయన తేల్చి చెప్పారు.

విలీనంతో వేగవంతం కానున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ రెండు విభాగాలు ఒకే లక్ష్యంతో పనిచేస్తున్నప్పటికీ, విడివిడిగా ఉండటం వల్ల సమన్వయం లోపిస్తోందని అధికారులు మంత్రికి వివరించారు. సిబ్బంది కొరత, తనిఖీల్లో ఇబ్బందులు, ల్యాబ్ సామర్థ్యం పెంపు, చట్టపరమైన చర్యల ఆలస్యం వంటి సవాళ్లను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఫుడ్ సేఫ్టీ, డ్రగ్ కంట్రోల్ విభాగాలను ఇంటిగ్రేట్ చేయడం ద్వారా తనిఖీలు, శాంపిల్ సేకరణ, ల్యాబ్ పరీక్షలు, ఇంటెలిజెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, చట్టపరమైన చర్యలు మరింత వేగంగా, సమర్థవంతంగా చేపట్టే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో పరిపాలనా, చట్టపరమైన, సాంకేతిక అంశాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి విలీనానికి సంబంధించిన సమగ్ర ప్రతిపాదనలు రూపొందించాలని మంత్రి ఆదేశించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మానవ వనరులను పెంచేందుకు, నిపుణుల నియామకానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి సూచించారు. రాష్ట్రంలోని ఫుడ్ టెస్టింగ్ ల్యాబులను ఆధునీకరించడంతో పాటు అవసరమైన చోట రీజనల్ ల్యాబుల ఏర్పాటును పరిశీలించాలన్నారు. ఆధునిక పరీక్షా పరికరాలు, సాంకేతికతను అందుబాటులోకి తెచ్చి ల్యాబ్‌ల సామర్థ్యాన్ని పెంచాలని స్పష్టం చేశారు.

**తప్పు చేస్తే కఠిన శిక్షే..**
**కానీ ఇండస్ట్రీకి ఇబ్బంది వద్దు**

కల్తీ ఆహారం, నాసిరకం, నకిలీ మెడిసిన్స్ తయారీ, నిల్వ, విక్రయాలపై కఠినంగా వ్యవహరించేలా ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవస్థను బలోపేతం చేయాలని మంత్రి ఆదేశించారు. తప్పు చేసిన వారికి కఠిన శిక్ష పడే వరకు డిపార్ట్‌మెంట్ యాక్షన్ కొనసాగాలని, అందుకోసం బలమైన లీగల్ టీమ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. అదే సమయంలో ఫుడ్ ఇండస్ట్రీని కాపాడుకోవాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వంపై ఉందని, ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించే హోటళ్లు, రెస్టారెంట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బంది పెట్టొద్దని స్పష్టం చేశారు. ఫార్మా, వ్యాక్సిన్ తయారీకి హైదరాబాద్ ప్రపంచ ప్రసిద్ధి గాంచిందని గుర్తు చేసిన మంత్రి, ఈ బ్రాండ్‌ను మరింత విస్తరించే విధంగా గుడ్ మ్యానుఫాక్చరింగ్ ప్రాక్టీసెస్‌ను (జీఎంపీ) ప్రోత్సహించాలని డీసీఏ డీజీ అవినాష్ మహంతికి సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, ఫుడ్ సేఫ్టీ కమిషనర్ సంగీత సత్యనారాయణ, డీసీఏ డీజీ అవినాష్ మహంతి, ఆరోగ్యశ్రీ సీఈవో హనుమంతు, తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రెండేళ్లలో మరో 5 లక్షల మెట్రిక్ టన్నుల గోదాముల సామర్థ్యం

**తెలంగాణ బ్యూరో, ఆశ్వ అప్డేట్స్:**

రాష్ట్రంలో గోదాముల సౌకర్యాన్ని విస్తరించేందుకు వచ్చే రెండేళ్లలో మరో 5 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యాన్ని అందుబాటులోకి తీసుకువస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం సచివాలయంలో రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్, మార్క్‌ఫెడ్, హాకా కార్పొరేషన్‌ల మేనేజింగ్ డైరెక్టర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు.

**ఆధీనంలో 52 స్వంత గోదాములు**

ప్రస్తుతం రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ ఆధీనంలో 52 స్వంత గోదాములు ఉండగా, వాటి నిల్వ సామర్థ్యం 6 లక్షల మెట్రిక్ టన్నులని తెలిపారు. ప్రస్తుతం 104 శాతానికి పైగా ఆక్యుపెన్సీతో 6.33 లక్షల మెట్రిక్ టన్నుల వ్యవసాయ ఉత్పత్తులు నిల్వ ఉన్నాయని చెప్పారు. రాష్ట్రంలో పెరుగుతున్న వ్యవసాయ ఉత్పత్తులకు అనుగుణంగా 48 కొత్త గోదాముల నిర్మాణం కొనసాగుతోందన్నారు. తొలి దశలో 17 గోదాములను 2027 జనవరి నాటికి, రెండో దశలో 31 గోదాములను 2028 డిసెంబర్ నాటికి పూర్తి చేసి మొత్తం సుమారు 5.8 లక్షల మెట్రిక్ టన్నుల అదనపు నిల్వ సామర్థ్యాన్ని కల్పిస్తామని వెల్లడించారు. భవిష్యత్ అవసరాల కోసం మరో 32 గోదాముల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

**సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు**

కొత్తగా నిర్మించే అన్ని గోదాములపై తప్పనిసరిగా సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించిన మంత్రి, రాష్ట్రంలోని ప్రభుత్వ కార్పొరేషన్ల ఆధీనంలోని గోదాములను సమన్వయంతో నిర్వహించి నిర్వహణ వ్యయాలు తగ్గించాలని సూచించారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో శాస్త్రీయ విధానాల్లో గోదాముల నిర్మాణం చేపట్టడంతో పాటు నిల్వ సరకు నాణ్యత దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలని, రానున్న 20 సంవత్సరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వేర్‌హౌసింగ్ మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని అధికారులకు ఆదేశించారు.

## ఆదిలాబాద్ సీసీఐని వెంటనే తెరవండి కేంద్ర మంత్రి కుమారస్వామిని కోరిన కేటీఆర్

- **ఆదిలాబాద్ సీసీఐ ప్లాంట్ పునరుద్ధరణ కోసం కేంద్ర మంత్రి కుమారస్వామితో కేటీఆర్ బృందం భేటీ.**
- **ప్లాంట్ రీ-ఓపెనింగ్‌కు కేంద్రం సానుకూలం.. రూ.2 వేల కోట్లతో కొత్త ఫ్యాక్టరీకి కేంద్ర మంత్రి ప్రతిపాదన.**
- **సీసీఐ పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వమే ఆటంకమన్న కేటీఆర్.. రాయితీలపై కేంద్రం అడిగినా స్పందించట్లేదని విమర్శ.**
- **ప్లాంట్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం తమ ప్రణాళికను బహిర్గతం చేయాలని డిమాండ్.. తెరిపించేదాకా బీఆర్ఎస్ పోరాటం.**

**తెలంగాణ బ్యూరో, ఆశ్వ అప్డేట్స్:**

ఆదిలాబాద్‌లోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్లాంట్‌ను వెంటనే తెరిపించాలని కేంద్ర హెవీ ఇండస్ట్రీస్ శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కలిసి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ముఖ్య నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. సీసీఐ పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉన్నదని మంత్రి స్పష్టం చేశారన్నారు. ప్లాంట్ పునఃప్రారంభం కావడానికి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ ప్రోత్సాహం, చిత్తశుద్ధి ఎంతో అవసరమని పేర్కొన్నారు. కేంద్రం అడిగిన వివరాలపై స్పందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్లాంట్ కోసం ఎలాంటి ప్రతిపాదనలు చేస్తుందో, ఎంత పెట్టుబడి పెడుతుందో బహిరంగంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. మారుమూల ప్రాంతానికి చెందిన వేలాదిమందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే ఈ ప్లాంట్‌ను తెరిపించే వరకూ బీఆర్ఎస్ పార్టీ తన పోరాటాన్ని నిరంతరం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

**కేంద్ర మంత్రి సానుకూలత..**

నేతల విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి కుమారస్వామి సానుకూలంగా స్పందించారని కేటీఆర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సైతం ఈ ప్లాంట్‌ను మళ్లీ నడపాలనే బలమైన కోరికతోనే ఉన్నదని చెప్పారు. అక్కడ 2,300 ఎకరాల భూమి అందుబాటులో ఉన్నదని.. అందులో 770 ఎకరాలు కంపెనీకి చెందిన పట్టా ల్యాండ్ కాగా, 1,500 పైచిలుకు ఎకరాలు లీజ్ ల్యాండ్ రూపంలో ఉన్నదని పేర్కొన్నారు. ఇక్కడ రూ.2,000 కోట్ల పెట్టుబడితో సరికొత్త ఫ్యాక్టరీని పెట్టినట్లయితే చాలా బాగుంటుందని కేంద్ర మంత్రి అభిప్రాయపడ్డారని తెలిపారు. అయితే.. ప్లాంట్ పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వమే ప్రధాన ఆటంకంగా మారిందని నేతలు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం పదేళ్లుగా బీఆర్ఎస్ అనేక సందర్భాల్లో చేసిన ఒత్తిడి ఫలితంగా సీసీఐ ఆదిలాబాద్ పునరుద్ధరణపై సానుకూలంగా ఉన్నట్టు కేటీఆర్ తెలిపారు. సిసిఐ పునరుద్ధరణకు ఏడాది కాలంగా కేంద్రం ఇన్సెంటివ్స్, పవర్ సబ్సిడీ, క్యాపిటల్ సబ్సిడీ, జీఎస్టీ మినహాయింపులపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు కోరుతున్నా.. అక్కడ ఉన్న లోకల్ స్టేట్ గవర్నమెంట్ స్పందించకుండా విషయాలను దాటవేస్తున్నదని, మైనింగ్ లీజ్ పొడిగించడానికి ముందుకు రావడం లేదని కేంద్ర మంత్రి స్పష్టం చేసినట్లు కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే వెంటనే సీసీఐ పునరుద్ధరణకు ప్రభుత్వం తరఫున పెట్టుబడి ప్రణాళికలను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో మాజీ మంత్రి జోగురామన్న, రాజ్యసభ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ వద్దిరాజు రవిచంద్ర, సీసీఐ సాధన సమితి సభ్యులు ఉన్నారు.





## 50 నామినేటెడ్ పదవులు ఈ నెలలోనే భర్తీ: టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

- **మంచి పనితీరు కనబరిచిన వారిని రెన్యువల్ చేస్తామన్న మహేశ్ గౌడ్**
- **పార్టీ పదవులపై మీనాక్షి నటరాజన్ తో చర్చించామని వెల్లడి**
- **మండల కమిటీలలో డీసీసీల రిపోర్ట్ ఫైనల్ అని స్పష్టీకరణ**

**తెలంగాణ బ్యూరో, ఆశ్వ అప్డేట్స్:**

రాష్ట్రంలో 50 నామినేటెడ్ పదవులను ఈ నెలలోనే భర్తీ చేస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించారు. ప్రస్తుతం మంచి పనితీరు కనబరిచిన వారిని రెన్యువల్ చేసే అవకాశం ఉందన్నారు. డీసీసీల పనితీరు బాగోలేకపోతే మార్చే అవకాశం ఉందని వెల్లడించారు. పార్టీ పదవులపై మీనాక్షి నటరాజన్‌తో చర్చించామని తెలిపారు. రెండు రోజుల్లో సీఎం రేవంత్ రెడ్డితో భేటీ అవుతామన్నారు. మండల కమిటీలలో డీసీసీల రిపోర్ట్ ఫైనల్ అని స్పష్టం చేశారు. ఎంపీ రేణుకా చౌదరితో కూడా మాట్లాడానని మహేశ్ తెలిపారు. ఖమ్మంలో బీజేపీ, బీఆర్ఎస్ రెండూ కూడా కాంగ్రెస్ వైపు చూస్తున్నట్టుగా రేణుక తనతో చెప్పారని అన్నారు. కానీ ఆ వ్యాఖ్యలపై దుష్ప్రచారం చేశారు అని తెలిపారు. కూనంనేనితో తమకెలాంటి విభేదాలూ లేవన్నారు. స్థానికంగా ఉన్న సమస్యలను స్థానికంగానే పరిష్కరించుకోవాలని చెప్పారు.

## గతంలో మమ్మల్ని అడ్డుకున్నారు.. ఇప్పుడు జగన్‌కు పూర్తి స్వేచ్ఛనిస్తున్నాం: లోకేశ్

మొదటిపేజీ తరువాయి

విమర్శించారు. బ్రాహ్మణి స్టీల్స్ పేరుతో 14,000 ఎకరాల భూమిని కారుచౌకగా కొట్టేసి, 10,000 ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఒక్క ఇటుక కూడా పేర్చలేదని ఆరోపించారు. ఓబులాపురం గనుల నుంచి దోచుకున్న సొమ్ముతోనే సాక్షి పత్రిక, టీవీలను ఏర్పాటు చేశారని దుయ్యబట్టారు. ఐదేళ్ల పాలనలో కడప జిల్లాకు జగన్ చేసిందేమీ లేదని, ఆయన నియోజకవర్గమైన పులివెందులకు నీళ్లిచ్చింది కూడా చంద్రబాబేనని గుర్తుచేశారు.

"గొడ్డలి పార్టీ ఫ్యాక్షనిజం తెస్తే, మేం ఫ్యాక్టరీలు తెస్తున్నాం. రాయలసీమలో వారు రక్తాన్ని పారిస్తే, మేం ఉద్యోగాల పంట పండిస్తున్నాం" అని లోకేశ్ అన్నారు. తమ ప్రభుత్వం జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్‌కు భూమిపూజ చేసిందని, ఎస్ఏఈఎల్ ఎనర్జీ ప్లాంట్‌ను ప్రారంభించిందని తెలిపారు.

**ఎంతచేసినా కార్యకర్తల రుణం తీర్చుకోలేం**

వైసీపీ హయాంలో దారుణహత్యకు గురైన బీసీ నేత నందం సుబ్బయ్య కుటుంబాన్ని ఆదుకుని, పిల్లలను ఎన్టీఆర్ ట్రస్ట్ స్కూల్‌లో చదివిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నామని లోకేశ్ స్పష్టం చేశారు. వైసీపీ హయాంలో ఎన్నిరకాలుగా ఇబ్బంది పెట్టినా ఎత్తిన పసుపు జెండా దించకుండా పార్టీకి అండగా నిలిచింది కార్యకర్తలేనని లోకేశ్ అన్నారు. ఎంతచేసినా వారి రుణం తీర్చుకోలేమని భావోద్వేగంతో చెప్పారు.

"ప్రొద్దుటూరు నియోజకవర్గంలో యువగళం పాదయాత్ర సందర్భంగా నాపై కోడిగుడ్లతో దాడిచేసి, భయపెట్టాలని చూశారు, జి.ఓ. నెం.1 పేరుతో పాదయాత్రను అడ్డుకోవాలని విఫలయత్నం చేశారు. తెలుగుదేశం పార్టీకి కంచుకోట కడప జిల్లా. మధ్యలో రెండు ఎన్నికల్లో ఇబ్బందిపడినా గత ఎన్నికల్లో పోరాడిన కార్యకర్తలు పార్టీకి గత వైభవం తెచ్చారు. అధికారంలోకి వచ్చామని కష్టకాలాన్ని మర్చిపోకూడదు. నేను పాదయాత్ర బుక్ చూసినపుడు ఆనాటి స్మృతులన్నీ గుర్తుకువస్తుంటాయి" అని వివరించారు.

ఈ నెల 24న రెండో విడత 'తల్లికి వందనం' నిధులను జమ చేయనున్నట్లు ప్రకటించారు. రూ.4000 పెన్షన్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు వంటి హామీలను అమలు చేస్తున్నామన్నారు. వైఎస్ఆర్‌సిపి హయాంలో పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించామని, చెత్తపన్నును రద్దు చేశామని తెలిపారు. కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని, నాయకులందరూ వర్గాలను పక్కనపెట్టి కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి సవిత, పార్లమెంటు పార్టీ అధ్యక్షుడు భూపేష్ రెడ్డి, ఎమ్మెల్యే వరదరాజులు రెడ్డి పాల్గొన్నారు.

## తెలంగాణలో అమెజాన్ భారీ పెట్టుబడి

మొదటిపేజీ తరువాయి

అత్యాధునిక నగరాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు.

2034 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రస్తుతం దేశ జనాభాలో రాష్ట్రం వాటా 2.5 శాతం మాత్రమే ఉన్నప్పటికీ, జీడీపీలో 5 శాతం వాటా ఉందని, దానిని 10 శాతానికి పెంచేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందని పేర్కొన్నారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు సింగిల్ విండో విధానం, పారదర్శక అనుమతుల వ్యవస్థ, వేగవంతమైన భూ కేటాయింపులతో పరిశ్రమలకు అనుకూల వాతావరణం కల్పిస్తున్నామని చెప్పారు. అమెజాన్ డేటా సెంటర్ ఏర్పాటుతో తెలంగాణలో డేటా సెంటర్ ఎకోసిస్టమ్ మరింత బలోపేతం కావడంతో పాటు ఐటీ, సాఫ్ట్‌వేర్, అనుబంధ పరిశ్రమలకు భారీగా పెట్టుబడులు వచ్చే అవకాశముందని సీఎం తెలిపారు. హైదరాబాద్‌ను కాలుష్యరహిత, సుస్థిర మహానగరంగా తీర్చిదిద్దేందుకు ఎలక్ట్రిక్ బస్సులు, ఈవీ వాహనాలకు ప్రోత్సాహకాలు, పన్ను రాయితీలు అమలు చేస్తున్నామని చెప్పారు. ఔటర్ రింగ్ రోడ్ వెలుపల, రీజినల్ రింగ్ రోడ్ లోపల ప్రాంతాన్ని తయారీ పరిశ్రమల కేంద్రంగా అభివృద్ధి చేసి లక్షలాది ఉద్యోగాలను సృష్టించడమే లక్ష్యమన్నారు. ఫ్యూచర్ సిటీ, రీజినల్ రింగ్ రోడ్ అభివృద్ధి కోసం భూములు అందించిన రంగారెడ్డి జిల్లా రైతులకు ప్రభుత్వం న్యాయమైన నష్టపరిహారం అందిస్తుందని సీఎం హామీ ఇచ్చారు. అమెజాన్ వెబ్ సర్వీసెస్ యాజమాన్యానికి అవసరమైన అన్ని అనుమతులను వేగంగా మంజూరు చేస్తామని తెలిపారు. మంత్రి డి. శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ఫ్యూచర్ సిటీ పరిధిలో AWS డేటా సెంటర్ ఏర్పాటు తెలంగాణ డిజిటల్ మౌలిక సదుపాయాల విస్తరణలో కీలక మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. రాష్ట్రంలో ప్రత్యేక డేటా సెంటర్ పార్క్ ఏర్పాటు చేసి నిరంతర విద్యుత్, నీరు, రహదారులు, కనెక్టివిటీతో కూడిన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. కృత్రిమ మేధస్సు (AI) అవసరాలకు అనుగుణంగా తెలంగాణను అత్యాధునిక డిజిటల్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు, అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రతినిధులు, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




# తెలంగాణ కాంగ్రెస్‌లో నామినేటెడ్ పదవుల వేడి..

మొదటిపేజీ తరువాయి

కార్పొరేషన్లు, ఫెడరేషన్లకు చైర్మన్లను నియమించింది. వారి రెండేండ్ల పదవీకాలం జూలై 8, 2026తో పూర్తయ్యింది. పదవులు ముగిసిన వారిలో తూర్పు జగ్గారెడ్డి భార్య నిర్మల, పటేల్ రమేశ్‌రెడ్డి, గురునాథ్‌రెడ్డి, ఎం వీరయ్య తదితరులు తమకు మరో అవకాశం ఇవ్వాల్సిందేనని పట్టుబడుతున్నారు. వారు ఢిల్లీస్థాయిలో పైరవీలు చేస్తున్నట్టు తెలిసింది. కొందరు నేతలు నాయకులు గాంధీభవన్ చుట్టూ లాబీయింగ్ మొదలుపెట్టారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల వ్యూహంలో భాగంగా ఈ నియామకాలను ఉపయోగించుకోవాలనే ఆలోచనతో ముఖ్యనేత ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది.

**కొందరికే రెన్యువల్.. అందరికీ నో**

పోస్టులను రెన్యూవల్ చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సుముఖంగా లేరని పార్టీ వర్గాలంటున్నాయి. పాత చైర్మన్ల పనితీరుపై నివేదిక తెప్పించుకున్న సీఎం, రెన్యువల్‌కు అర్హులైన వారి సంఖ్యను సింగిల్ డిజిట్‌కే పరిమితం చేయనున్నట్టు తెలిసింది. మిగతావి రెన్యువల్ అవసరం లేదనే ఆలోచనతో ఉన్నట్టు తెలిసింది. ప్రస్తుతం ఖాళీ అయిన వాటితోపాటు ఇప్పటివరకు భర్తీ చేయనివి కలిపి 50కి పైగా పదవులు ఖాళీగా ఉన్నాయి. తన పదవి పొడిగింపు వ్యవహారం ఇంకా పెండింగ్‌లోనే ఉన్నదని చెప్పేందుకే జగ్గారెడ్డి తాను ఎన్నికల్లో పోటీ చేయను అని, తన భార్య పోటీ చేస్తుందనే ప్రకటనలు చేస్తున్నారని కాంగ్రెస్ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది. ఇలాంటి ప్రకటనల ద్వారా పార్టీ అగ్రనాయకత్వం మీద ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారనే చర్చ జరుగుతున్నది.

**ముఖ్యనేత సొంత లిస్టు**

ముఖ్యనేత ఆలోచన మరోతీరుగా ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది. రాబోయే ఎన్నికల ముందు జరుగుతున్న కీలక భర్తీలు కాబట్టి తన రాజకీయ భవిష్యత్తుకు అనుగుణంగా భర్తీ చేసుకోవాలనే భావిస్తున్నట్టు సమాచారం. భవిష్యత్తులో ఎలాంటి పరిస్థితులు తలెత్తినా.. తనకు అండగా ఉండే వారికే పదవులు కట్టబెట్టాలని చూస్తున్నట్టు తెలిసింది. అసలు కాంగ్రెస్ నేతలకు బదులు వలస కాంగ్రెస్ నేతలతో కీలకమైన పదవులు భర్తీ చేయాలని ఆలోచిస్తున్నట్టు సమాచారం. ముఖ్యంగా సీనియర్లను మొత్తానికే పక్కనపెట్టి, తన వెంట వచ్చేవారి పేర్లతో లిస్ట్ సిద్ధంచేయాలని తన శిబిరం నేతలను ఆదేశించినట్టు సమాచారం.

**నిధుల్లేని కార్పొరేషన్లు.. నిరసన సెగలు**

దీనికి భిన్నంగా, కుల సంక్షేమ కార్పొరేషన్లు, ఫెడరేషన్ల విషయంలో ప్రభుత్వం ఇప్పటికే చర్యలు మొదలుపెట్టింది. ఇటీవల మే 6న పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ 18 కార్పొరేషన్లకు చైర్మన్లను, 11మంది వైస్ చైర్మన్లను ఖరారు చేశారు. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్(బస్వరాజు శ్రీనివాస్), కమ్మ కార్పొరేషన్(బండి రమేశ్), వెలమ కార్పొరేషన్(జువ్వాడి నర్సింగ్ రావు), యాదవ సహకార సంస్థ(ఎం రఘునాథ్ యాదవ్), మున్నూరుకాపు(బొమ్మ శ్రీరామ్), వాల్మీకి బోయ(గట్టు తిమ్మప్ప), పద్మశాలి(గూడూరు శ్రీనివాస్) కార్పొరేషన్లకు నియామకాలు జరిగాయి. మిగతావి జూలైలో భర్తీ చేస్తామని అప్పట్లోనే టీపీసీసీ చీఫ్ ప్రకటించారు. కొత్త చైర్మన్లను నియమించినా, కార్పొరేషన్లకు నిధుల విడుదల లేకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. చైర్మన్ల భర్తీ కంటే నిధుల కొరతే పెద్ద సమస్యగా మారిందని, సబ్సిడీ రుణాలు, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి కోసం సరిపడా నిధుల్లేక చాలా కార్పొరేషన్లు నామమాత్రంగానే కొనసాగుతున్నాయని తెలుస్తున్నది. మరోవైపు కొత్త చైర్మన్లలో కొందరు కార్యాలయాలు, భద్రతా సిబ్బంది వంటి సౌకర్యాల కోసం ఇప్పటికే లాబీయింగ్ చేస్తున్నట్టు సమాచారం.



# ఉత్తర తెలంగాణ ఉద్యమకారులతో గుర్తింపు కమిటీ ముఖాముఖి

- **సంక్షేమ డిమాండ్లపై వినతులు స్వీకరణ.. సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని హామీ**

**హైదరాబాద్, జూలై 15 (ఆశ్వి ప్రతినిధి):**

తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ (జీవో నెం.679) ఆధ్వర్యంలో ఉత్తర తెలంగాణ జిల్లాల ఉద్యమకారులతో బుధవారం అమరవీరుల స్మారక చిహ్నం (అమరదీపం) వద్ద ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ అభిప్రాయాలు, సంక్షేమ డిమాండ్లను కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు, సభ్యుడు ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు మోతె శోభన్ రెడ్డి, ఎస్. రాములు నాయక్ తదితరులు ఉద్యమకారులతో సమావేశమై వారి పోరాట అనుభవాలు, ఆధారాలను పరిశీలించారు. స్వరాష్ట్ర సాధనలో ఉత్తర తెలంగాణ జిల్లాల ఉద్యమకారులు కీలక పాత్ర పోషించారని కమిటీ సభ్యులు కొనియాడారు.

ఈ సందర్భంగా ఉద్యమకారులు అర్హులైన ప్రతి కుటుంబానికి 250 గజాల ఇంటి స్థలం, గౌరవప్రదమైన జీవితకాల నెలవారీ పెన్షన్, ఉద్యమకారుల పిల్లలకు విద్య, ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్లు, మహిళా ఉద్యమకారులకు ప్రత్యేక సంక్షేమ పథకాలు, ఉచిత కార్పొరేట్ వైద్య సేవల కోసం డిజిటల్ హెల్త్ కార్డులు, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, రాష్ట్రవ్యాప్తంగా టీజీఎస్ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కమిటీకి వినతిపత్రాలు సమర్పించారు. సమావేశంలో వచ్చిన ప్రతి సూచన, డిమాండ్‌ను సానుకూలంగా నమోదు చేస్తున్నామని, ఒక్క నిజమైన ఉద్యమకారుడికి కూడా అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటామని కమిటీ సభ్యులు హామీ ఇచ్చారు. జూలై 22 వరకు ఈ ముఖాముఖి సమావేశాలు కొనసాగుతాయని, అనంతరం సమగ్ర నివేదికను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి సమర్పించి ఉద్యమకారుల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకునేలా కృషి చేస్తామని కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు తెలిపారు.



# గోల్కొండ బోనాల ఉత్సవాలకు సీఎం రేవంత్ రెడ్డికి ఆహ్వానం

- **జూబ్లీహిల్స్ నివాసంలో మర్యాదపూర్వకంగా ఆహ్వాన పత్రం అందజేసిన మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ అధికారులు**

**హైదరాబాద్, జూలై 15 (ఆశ్వి ప్రతినిధి):**

ఆషాఢ మాస బోనాల ఉత్సవాల సందర్భంగా నిర్వహించే శ్రీ జగదాంబ మహంకాళి దేవాలయం (గోల్కొండ) బోనాల ఉత్సవాలకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని ఆలయ ప్రతినిధులు ఆహ్వానించారు. గురువారం నుంచి బోనాల ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, ఆలయ ఈవో, ప్రధాన పూజారులు, ధర్మకర్తల మండలి సభ్యులు జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బోనాల ఉత్సవాల వైభవం, ఆలయంలో నిర్వహించనున్న ప్రత్యేక పూజలు, కార్యక్రమాల వివరాలను ముఖ్యమంత్రికి వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానాన్ని స్వీకరించి ఉత్సవాలు విజయవంతం కావాలని ఆకాంక్షించినట్లు అధికారులు తెలిపారు.


# మూడు నెలలుగా నిలిచిన ఆర్‌టీఏ కార్డుల డిస్పాచ్.. వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు

**హైదరాబాద్, జూలై 15, ఆశ్వి అప్డేట్స్:**

రాష్ట్రవ్యాప్తంగా రవాణా శాఖలో వాహనాల రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ (ఆర్‌సీ) కార్డులు, డ్రైవింగ్ లైసెన్స్ (డీఎల్) కార్డుల డిస్పాచ్ ప్రక్రియ గత మూడు నెలలుగా నిలిచిపోయిందనే సమాచారం వాహనదారులను ఆందోళనకు గురిచేస్తోంది. జిల్లా రవాణా కార్యాలయాల్లో వేల సంఖ్యలో ఆర్‌సీ, డీఎల్ కార్డులు పేరుకుపోయినా వాటిని లబ్ధిదారులకు పంపిణీ చేయలేక అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది.

రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయినప్పటికీ కార్డులు చేతికి అందకపోవడంతో వాహనదారులు ప్రతిరోజూ రవాణా శాఖ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కార్డులు అందకపోవడంతో ట్రాఫిక్ తనిఖీల సమయంలో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రిజిస్ట్రేషన్ పూర్తయిందని వారు చెప్పినా, కార్డు చూపించాలని ట్రాఫిక్ పోలీసులు కోరడంతో పలుచోట్ల వాగ్వివాదాలు చోటు చేసుకుంటున్నట్లు సమాచారం. రవాణా శాఖ కార్యాలయాల్లో డిస్పాచ్ కాకుండా పేరుకుపోయిన కార్డుల కారణంగా సంబంధిత అధికారులు కూడా వాహనదారులకు స్పష్టమైన సమాధానం ఇవ్వలేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోంది. సాంకేతిక సమస్యలు, అవసరమైన సౌకర్యాల కొరత కారణంగానే డిస్పాచ్ ప్రక్రియ ఆలస్యమవుతోందని శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఇటీవల అమల్లోకి వచ్చిన 'వాహన్' (VAHAN) పోర్టల్ మార్పులు, సాంకేతిక సమస్యలు కూడా ఈ జాప్యానికి ఒక కారణమని అధికారులు అనధికారికంగా చెబుతున్నట్లు సమాచారం. అయితే సమస్యను పరిష్కరించేందుకు ఉన్నత స్థాయిలో వేగవంతమైన చర్యలు కనిపించడం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ కార్డులు, డ్రైవింగ్ లైసెన్స్‌లు త్వరితగతిన పంపిణీ చేసేలా ప్రభుత్వం, రవాణా శాఖ ఉన్నతాధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. దీంతో పాటు డిస్పాచ్ ప్రక్రియ ఎప్పుడు పునఃప్రారంభమవుతుందనే విషయంపై అధికారిక ప్రకటన విడుదల చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.




# జన్వాడ జెడ్పీహెచ్ఎస్ అభివృద్ధి పనులను పరిశీలించిన సబితా ఇంద్రారెడ్డి

- **నాణ్యతతో, గడువులోపు పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచన**

**మహేశ్వరం, జూలై 15 (ఆశ్వి ప్రతినిధి):**


మహేశ్వరం నియోజకవర్గంలోని జన్వాడ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కార్పొరేట్ సామాజిక బాధ్యత (CSR) నిధులతో కొనసాగుతున్న అభివృద్ధి పనులను మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చేపడుతున్న మౌలిక వసతుల అభివృద్ధి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను నాణ్యతతో పాటు నిర్ణీత గడువులోగా పూర్తి చేసి విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించాలని అధికారులకు సూచించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధి కోసం మాజీ మంత్రి కే.టి. రామారావు (కేటీఆర్) చొరవతో కార్పొరేట్ సామాజిక బాధ్యత (CSR) నిధులను సమకూర్చి అభివృద్ధి పనులు చేపట్టడం అభినందనీయమని సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# 80 తులాల బంగారం చోరీ కేసు ఛేదన.. 63 కేసుల నిందితుడు అరెస్ట్

**సిద్దిపేట, జూలై 15 (అశ్వి అప్‌డేట్):**

దుబ్బాక పోలీస్ స్టేషన్ పరిధిలో సంచలనం సృష్టించిన భారీ చోరీ కేసును సిద్దిపేట పోలీసులు ఛేదించారు. ఈ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి, అతడి వద్ద నుంచి 80 తులాల బంగారు ఆభరణాలు, 5.5 కిలోల వెండి, రూ.1,300 నగదు, రోల్డ్ గోల్డ్ ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఆస్తి విలువ సుమారు రూ.90 లక్షలకు పైగా ఉంటుందని పోలీసులు తెలిపారు. దుబ్బాకకు చెందిన చింత రాజ్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి ఉత్తర భారతదేశానికి తీర్థయాత్రకు వెళ్లిన సమయంలో, జూన్ 28 అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తి ఇంటి కిటికీ ఊచలు విరగొట్టి లోపలికి ప్రవేశించి లాకర్ తెరిచి బంగారం, వెండి ఆభరణాలను అపహరించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు దుబ్బాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్, ఐపీఎస్ ఆదేశాలతో ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, సుమారు 400 నుంచి 500 సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితుడు చిక్కుడు కృష్ణ అలియాస్ వెంగాలి బిక్షపతి (37), తొగుట మండలం లింగంపేట గ్రామానికి చెందిన ఎలక్ట్రీషియన్ అని గుర్తించి అరెస్ట్ చేశారు. విచారణలో నిందితుడిపై సిద్దిపేట, మెదక్, మేడ్చల్, సంగారెడ్డి, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల్లో మొత్తం 63 చోరీ కేసులు నమోదైనట్లు తేలింది. ఇటీవల మరో చోరీ కేసులో జైలుకు వెళ్లిన సమయంలో పరిచయమైన జైలు వార్డర్ పాత్రపై కూడా పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన ఏసీపీలు, సీఐలు, ఎస్ఐలు, సీసీఎస్ బృంద సభ్యులను పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ అభినందించారు. ప్రజలు ఇళ్ల వద్ద తప్పనిసరిగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఎక్కువ రోజులు ఇంటికి తాళం వేసి వెళ్లే పరిస్థితుల్లో స్థానిక పోలీస్ స్టేషన్‌కు ముందస్తుగా సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.







# నెహ్రూ టు రాహుల్.. బీసీలకు మోసమే!

**మొదటిపేజీ తరువాయి**

చేసిందేమిటి?' పుస్తకావిష్కరణ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీకి మొదటి నుంచి వెనుకబడిన వర్గాల పట్ల తీవ్రమైన వివక్ష మరియు వ్యతిరేక మైండ్‌సెట్ ఉందని రాంచందర్ రావు మండిపడ్డారు. దేశ ప్రధానిగా ఉన్న సమయంలో జవహర్‌లాల్ నెహ్రూ 7 జూన్ 1961 న దేశ ముఖ్యమంత్రులకు స్వయంగా లేఖ రాస్తూ.. తాను రిజర్వేషన్లకు వ్యతిరేకమని, మెరిట్ దెబ్బతింటుందని, కాబట్టి రిజర్వేషన్ల విధానాన్ని అనుసరించవద్దని స్పష్టంగా పేర్కొన్నారని, ఇది పార్లమెంట్ రికార్డుల్లో ఉందని గుర్తు చేశారు. నాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్ పార్టీ బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుందే తప్ప వారి సామాజిక అభ్యున్నతికి చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. 'కులాలను రాజకీయ అవసరాల కోసం, ఓట్ల వేట కోసం వాడుకోకూడదు. వెనుకబడిన కులాలను గుర్తించి, సామాజికఆర్థిక సర్వేల ద్వారా వారి జీవన ప్రమాణాలను పెంపొందించి సమాజంలో వారిని పైకి తీసుకురావడానికే రిజర్వేషన్లు ఉపయోగపడాలి' అని స్పష్టం చేశారు. కానీ కాంగ్రెస్ పార్టీ కేవలం తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసమే కులాల మధ్య కుంపట్లు పెడుతోందని విమర్శించారు.

**బీసీ కమిషన్‌కు స్వయం ప్రతిపత్తి**

బీసీల హక్కుల కోసం రాజ్యాంగబద్ధమైన బీసీ కమిషన్‌కు స్వయం ప్రతిపత్తి కల్పించిన ఘనత కేవలం నరేంద్ర మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ప్రజల చేత తిరస్కరించబడి 'కాంగ్రెస్ ముక్త్ భారత్' దిశగా సాగుతోందని రాంచందర్ రావు పేర్కొన్నారు. బీసీలకు అడుగడుగునా మోసం, ద్రోహం చేసిన కాంగ్రెస్ పార్టీ నైజాన్ని ప్రజలంతా గ్రహించారని తెలిపారు. ఇటు రాష్ట్రాల్లోనూ బీసీ వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కాంగ్రెస్‌ను తెలంగాణ గడ్డ నుంచి కూడా తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడం ద్వారా 'కాంగ్రెస్ ముక్త్ తెలంగాణ'ను తీర్చిదిద్దాలని, వెనుకబడిన వర్గాల ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలని రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు.



# తెలంగాణలో 'ఎస్ఐఆర్' గడువు పొడిగింపు

**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్**

తెలంగాణతో పాటు పలు రాష్ట్రాలలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది. ఎన్యూమరేటర్లు వచ్చే నెల 3వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తారని స్పష్టం చేసింది.

తెలంగాణ, పంజాబ్ రాష్ట్రాల్లో జూన్ 25న ప్రారంభమైన ఇంటింటి సర్వే గడువును ఆగస్టు 3 వరకు పొడిగించారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను కూడా ఇదే తేదీలోగా పూర్తి చేయనున్నారు. తెలంగాణలో ఆగస్టు 10న, పంజాబ్‌లో ఆగస్టు 13న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణకు తెలంగాణలో సెప్టెంబర్ 9 వరకు, పంజాబ్‌లో సెప్టెంబర్ 12 వరకు అవకాశం కల్పించారు. అనంతరం, అక్టోబర్ 12న రెండు రాష్ట్రాల్లోనూ తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తారు. ఢిల్లీ, కర్ణాటక రాష్ట్రాల్లో జూన్ 30న ప్రారంభమైన ఇంటింటి సర్వే గడువును ఆగస్టు 8 వరకు పొడిగించారు. ఆగస్టు 17న ముసాయిదా జాబితాను విడుదల చేసి, సెప్టెంబర్ 16 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. అన్ని ప్రక్రియలను పూర్తి చేసి, అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను వెల్లడిస్తారు.

బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓ) చేపట్టే ఇంటింటి సర్వేలో భాగంగా నకిలీ ఓట్లు తొలగింపు, మరణించిన వారి పేర్ల తొలగింపు, చిరునామా మార్పులు వంటి సవరణలు చేపడతారు. సవరించిన గడువులను కచ్చితంగా పాటించాలని ఆయా రాష్ట్రాల ఎన్నికల ప్రధాన అధికారులను కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది.




# తెలంగాణలో వింత వాతావరణం..

- **రేపు 5 జిల్లాలకు ఉక్కపోత హెచ్చరిక!**
- **తెలంగాణలో జులై 22 వరకు పొడి వాతావరణం**
- **5 జిల్లాల్లో వేడి, ఉక్కపోత ఉంటుందని ఐఎండీ హెచ్చరిక**
- **రాష్ట్రంలోని 28 జిల్లాల్లో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం**
- **పలు జిల్లాల్లో వర్షా భావం, హన్మకొండలో 65 శాతం లోటు నమోదు**
- **హైదరాబాద్‌లో 36 డిగ్రీల వరకు చేరనున్న గరిష్ఠ ఉష్ణోగ్రత**

**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్**

తెలంగాణలో రుతుపవనాలు బలహీనపడటంతో వర్షాకాలంలోనూ పొడి వాతావరణం కొనసాగుతోంది. రాష్ట్రంలో వర్షపాతం లోటు ఆందోళన కలిగిస్తుండగా, మరోవైపు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో, రేపు (జులై 16) ఐదు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో వేడి, ఉక్కపోతతో కూడిన వాతావరణం ఉంటుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది.

బుధవారం విడుదల చేసిన బులెటిన్ ప్రకారం.. ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో గురువారం తీవ్రమైన ఉక్కపోత ప్రభావం చూపే అవకాశం ఉంది. వీటితో పాటు రాష్ట్రంలోని 28 జిల్లాల్లో బలమైన ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. హైదరాబాద్, దాని పరిసర ప్రాంతాల్లో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుందని, గరిష్ఠ ఉష్ణోగ్రత 36 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 26 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది.

రాష్ట్రవ్యాప్తంగా జులై 22 వరకు పొడి వాతావరణమే కొనసాగుతుందని, తేలికపాటి జల్లులు మినహా భారీ వర్షాలకు అవకాశం లేదని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే పలు జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఒక్క హన్మకొండ జిల్లాలోనే ఈ జులై నెలలో ఇప్పటివరకు 65 శాతం వర్షపాతం లోటు నమోదైంది. పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతుండగా, ఇటీవల నల్గొండలో 38.9 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డయింది. బంగాళాఖాతంలో అల్పపీడనం ఉన్నప్పటికీ, రుతుపవన ద్రోణి రాష్ట్రంలో వర్షాలకు అనుకూలంగా లేకపోవడమే ఈ పరిస్థితికి కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. రానున్న మూడు రోజుల్లో గంటకు 3040 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని ఐఎండీ వెల్లడించింది.

# నేరాల నియంత్రణ, పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి: యాదాద్రి ఎస్పీ అక్షాన్ష్ యాదవ్

**భువనగిరి, జూలై 15 (అశ్వి అప్‌డేట్):**

జిల్లాలో నేరాల నియంత్రణ, పెండింగ్ కేసుల దర్యాప్తుపై ప్రత్యేక దృష్టి సారించి, నాణ్యమైన విచారణతో కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్, ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. భువనగిరిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన జిల్లా నేరాల సమీక్ష సమావేశంలో ఆయన శాంతిభద్రతలు, సైబర్ నేరాల నియంత్రణ, ట్రాఫిక్ భద్రత, సాంకేతిక వనరుల వినియోగం తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, పటిష్టమైన సాక్ష్యాధారాలతో కేసులను పూర్తి చేయాలని సూచించిన ఎస్పీ, గ్రామస్థాయిలో ఇంటెలిజెన్స్ వ్యవస్థను బలోపేతం చేసి నేరాలను ముందుగానే అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. Visible Policingను మరింత విస్తరించి ప్రజల్లో భద్రతాభావం పెంపొందించాలన్నారు. అదేవిధంగా Samanvai Portal, CEIR Portalలను సమర్థవంతంగా వినియోగించి పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల రికవరీతో పాటు నేరాల ఛేదనలో మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. లా అండ్ ఆర్డర్, సీసీఎస్, సైబర్ సెల్, ఐటీ సెల్ల మధ్య సమన్వయాన్ని పెంచి సాంకేతిక ఆధారిత పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని చెప్పారు. జిల్లాలో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో చైతన్యం కల్పించాలని, గ్రామాల వారీగా సీసీటీవీ కెమెరాల నెట్‌వర్క్ విస్తరణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్పీ సూచించారు. అలాగే పెట్రోలింగ్, నాకాబందీ, వాహన తనిఖీలను మరింత సమర్థవంతంగా నిర్వహించి నేరస్థుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, నాణ్యమైన పోలీసు సేవలు అందించడం ప్రతి పోలీసు అధికారికి బాధ్యత అని పేర్కొన్న ఎస్పీ, శాంతి భద్రతల పరిరక్షణలో ఎలాంటి రాజీ లేకుండా అంకితభావంతో విధులు నిర్వర్తించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌హెచ్‌ఓలు, సీసీఎస్, సైబర్ సెల్, ఐటీ సెల్‌తో పాటు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.







# రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక బ్యూరో

- **"ట్రాఫిక్ మేనేజ్మెంట్ & రోడ్ సేఫ్టీ బ్యూరో" ఏర్పాటు దిశగా తెలంగాణ పోలీస్ శాఖ చర్యలు**
- **ఉన్నతాధికారులతో డీజీపీ సి.వి. ఆనంద్ సమీక్ష.. రోడ్డు భద్రతపై సమగ్ర కార్యాచరణకు రూపకల్పన**

**హైదరాబాద్, జూలై 15 (ఆశ్వి ప్రతినిధి):**

రాష్ట్రంలో రోజురోజుకూ పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను సమర్థవంతంగా నియంత్రించి, ప్రజల ప్రాణాలను కాపాడే లక్ష్యంతో తెలంగాణ పోలీస్ శాఖ కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక "ట్రాఫిక్ మేనేజ్మెంట్ & రోడ్ సేఫ్టీ బ్యూరో" ఏర్పాటు చేయడానికి చర్యలు ప్రారంభించింది. ఈ ప్రతిపాదిత బ్యూరో ద్వారా ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణ, అవగాహన కార్యక్రమాలు, వివిధ శాఖల మధ్య సమన్వయం వంటి అంశాలను ఒకే వేదికపై నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందిస్తోంది.

ఈ నేపథ్యంలో బుధవారం డీజీపీ సి.వి. ఆనంద్ రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతిపాదిత బ్యూరో నిర్మాణం, విధులు, సిబ్బంది నియామకం, చట్టపరమైన అంశాలు, పరిపాలనా విధానాలు, అమలు చేయాల్సిన కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో రాష్ట్రంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల పరిస్థితి, వాటి ప్రధాన కారణాలు, ప్రమాదాలను తగ్గించేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై అధికారులు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఇతర రాష్ట్రాల్లో విజయవంతంగా అమలవుతున్న రోడ్డు భద్రతా నమూనాలను అధ్యయనం చేసి, వాటిలో ఉత్తమ విధానాలను తెలంగాణలో అమలు చేసే అవకాశాలపై చర్చించారు. అలాగే రోడ్డు భద్రతకు సంబంధించి సుప్రీంకోర్టు మార్గదర్శకాలు,




కేంద్ర ప్రభుత్వ నిబంధనలు, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు (జీవోలు) తదితర అంశాలను సమీక్షించారు. ప్రతిపాదిత బ్యూరోను కేవలం ట్రాఫిక్ నియంత్రణకే పరిమితం కాకుండా, రవాణా శాఖ, రోడ్లుభవనాల శాఖ, మున్సిపల్ సంస్థలు, జాతీయ రహదారుల సంస్థ, వైద్య ఆరోగ్య శాఖ తదితర విభాగాలతో సమన్వయం చేస్తూ ప్రమాదాల నివారణకు సమగ్ర వ్యవస్థగా అభివృద్ధి చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, ట్రాఫిక్ నిబంధనల అమలును మరింత కట్టుదిట్టం చేయడం, ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాలను (బ్లాక్ స్పాట్లు) గుర్తించి తక్షణ చర్యలు చేపట్టడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ట్రాఫిక్ నిర్వహణను ఆధునీకరించడం వంటి అంశాలపై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని డీజీపీ సి.వి. ఆనంద్ అధికారులను ఆదేశించారు.

ఈ అంశాలపై త్వరలో మరోసారి ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి బ్యూరో ఏర్పాటుకు తుది రూపురేఖలు ఖరారు చేయనున్నట్లు డీజీపీ తెలిపారు. సమావేశంలో డీజీ (ఆర్గనైజేషన్) స్వాతి లక్రా, రోడ్డు భద్రత విభాగం ఐజీ రమేష్ నాయుడు, ఐజీ (పీ & ఎల్) గజరావు భూపాల్, జాయింట్ సీపీలు సన్‌ప్రీత్ సింగ్, జోయల్ డేవిస్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## విద్యాసంస్థల్లో డ్రగ్స్‌కు జీరో టాలరెన్స్

- **యాంటీ డ్రగ్స్ అండ్ సేఫ్టీ కమిటీల ఏర్పాటు తప్పనిసరి**
- **ప్రతి విద్యాసంస్థలో క్యాంపస్ సేఫ్టీ కోఆర్డినేటర్ నియామకం.. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: డీజీపీ సి.వి. ఆనంద్**

**హైదరాబాద్, జూలై 15 (ఆశ్వి ప్రతినిధి):**

రాష్ట్రంలోని విద్యాసంస్థలను పూర్తిస్థాయిలో డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతోంది. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యాసంస్థల్లో డ్రగ్స్‌పై జీరో టాలరెన్స్ విధానాన్ని కచ్చితంగా అమలు చేయనున్నట్లు రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) సి.వి. ఆనంద్ స్పష్టం చేశారు. డ్రగ్స్ విక్రయం, వినియోగం లేదా ప్రోత్సాహానికి పాల్పడే వారిపై మాత్రమే కాకుండా, నిబంధనలు పాటించని విద్యాసంస్థలపైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈ నేపథ్యంలో బుధవారం ఈగల్ (EAGLE) అధికారులతో డీజీపీ ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. విద్యాసంస్థల్లో డ్రగ్స్ నియంత్రణకు అనుసరించాల్సిన కార్యాచరణ, పర్యవేక్షణ వ్యవస్థ, కమిటీల ఏర్పాటు, మార్గదర్శకాల రూపకల్పన తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

**ప్రతి విద్యాసంస్థలో యాంటీ డ్రగ్స్ కమిటీ**

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, ఇతర విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్స్ అండ్ సేఫ్టీ కమిటీల ఏర్పాటు తప్పనిసరి చేయాలని నిర్ణయించారు. అలాగే ప్రతి విద్యాసంస్థలో ఒక క్యాంపస్ సేఫ్టీ కోఆర్డినేటర్ నియమించాలని సూచించారు. విద్యార్థుల భద్రత, డ్రగ్స్ నివారణ చర్యలు, అవగాహన కార్యక్రమాలు, కౌన్సెలింగ్, తల్లిదండ్రులతో సమన్వయం వంటి అంశాలను ఈ కమిటీలు పర్యవేక్షించనున్నాయి.

**నిబంధనలు ఉల్లంఘిస్తే గుర్తింపు రద్దుకు సిఫార్సు**

విద్యాసంస్థల్లో డ్రగ్స్ విక్రయం, వినియోగం లేదా ప్రోత్సాహానికి సంబంధించిన ఘటనలు వెలుగులోకి వస్తే సంబంధిత యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీ అధికారులను ఆదేశించారు. అవసరమైతే ఆయా విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలని సంబంధిత శాఖలకు సిఫార్సు చేయాలని సూచించారు. విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని స్పష్టం చేశారు.

**అవగాహన, కౌన్సెలింగ్‌కు ప్రాధాన్యం**

విద్యార్థులు విద్యాసంస్థల్లో చేరిన తొలి దశ నుంచే డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కల్పించాలని సమావేశంలో నిర్ణయించారు. సైకాలజిస్టులు, కౌన్సెలర్ల సేవలను అందుబాటులో ఉంచడం, అవసరమైన వారికి మానసిక సలహాలు అందించడం, తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని పెంచడం, స్వచ్ఛంద సంస్థల సహకారంతో నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

**ఎస్ఓపీల రూపకల్పనకు ఆదేశాలు**

సమావేశంలో ఈగల్ అధికారులు యాంటీ డ్రగ్స్ అండ్ సేఫ్టీ కమిటీల నిర్మాణం, బాధ్యతలు, అమలు విధానం, పర్యవేక్షణ వ్యవస్థపై సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు. దీనిని పరిశీలించిన డీజీపీ, మరింత సమర్థవంతమైన విధివిధానాలు రూపొందించాలని సూచించారు. విద్యాశాఖ, ఆరోగ్యశాఖ, ఇతర సంబంధిత శాఖలు, నిపుణుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (SOPs) రూపొందించాలని ఆదేశించారు. తుది ప్రతిపాదనను ప్రభుత్వానికి సమర్పించే ముందు మరో సమీక్ష సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు.

**సమన్వయంతో డ్రగ్స్ నియంత్రణ**

డ్రగ్స్ నియంత్రణలో పోలీసు శాఖ, విద్యాశాఖ, ఆరోగ్యశాఖతో పాటు ఇతర సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని డీజీపీ సూచించారు. ప్రతి విద్యార్థికి సురక్షితమైన, ఆరోగ్యకరమైన, డ్రగ్స్ రహిత విద్యా వాతావరణాన్ని కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, ఐజీ పద్మజా రెడ్డి, ఎస్పీ గిరిధర్‌తో పాటు ఈగల్ విభాగానికి చెందిన ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

## నకిరేకల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ

- **పెండింగ్ కేసులు త్వరగా పూర్తి చేయాలి.. నేర నియంత్రణ, ప్రజాసేవలపై అధికారులకు కీలక ఆదేశాలు**



**నకిరేకల్, జూలై 15 (ఆశ్వి ప్రతినిధి):**

నల్గొండ జిల్లా నకిరేకల్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, సీసీ కెమెరాల పనితీరు, స్టేషన్ నిర్వహణ, సిబ్బంది హాజరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేషన్‌లో నమోదైన కేసుల దర్యాప్తు వేగవంతం చేసి, పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లు, బెయిల్‌పై ఉన్న నేరస్థులపై నిరంతర నిఘా కొనసాగించడంతో పాటు అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై తరచూ తనిఖీలు, నాకాబందీలు నిర్వహించాలని సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను మరింత పటిష్టం చేసి ప్రజల్లో భద్రతా భావన పెంపొందేలా పనిచేయాలని తెలిపారు. సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, ఆన్‌లైన్ మోసాలపై వచ్చే ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించి బాధితులకు అవసరమైన సహాయం అందించాలని సూచించారు. అలాగే ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును సున్నితంగా స్వీకరించి, చట్టపరమైన చర్యలు వేగంగా చేపట్టాలని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది క్రమశిక్షణ, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించే విధానంపై ప్రత్యేక దృష్టి సారించిన ఎస్పీ, అనంతరం సిబ్బందితో సమావేశమై శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, బాధితులకు సత్వర న్యాయం అందించడం పోలీసుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచేలా ప్రతి పోలీసు అధికారి బాధ్యతాయుతంగా, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని సూచించారు.



## గంగాధరలో జూద స్థావరంపై పోలీసుల దాడి

- **ఆరుగురు జూదరుల అరెస్టు.. రూ.52,380 నగదు, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం**
- **తెలంగాణ గేమింగ్ చట్టం కింద కేసు నమోదు.. అక్రమ కార్యకలాపాలపై ఉక్కుపాదం కొనసాగుతుందని పోలీసుల హెచ్చరిక**

**కరీంనగర్, జూలై 15 (ఆశ్వి ప్రతినిధి):**

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జూదం, పేకాట వంటి అక్రమ కార్యకలాపాల నిర్మూలనకు పోలీసులు చేపడుతున్న ప్రత్యేక చర్యల్లో భాగంగా గంగాధర మండలంలోని ఎల్లమ్మ తొవ్వ ప్రాంతంలో నిర్వహిస్తున్న జూద స్థావరంపై బుధవారం ఆకస్మికంగా దాడి నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు చేపట్టిన ఈ దాడిలో ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.52,380 నగదుతో పాటు ఐదు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం, ఎల్లమ్మ తొవ్వ ప్రాంతంలో కొందరు వ్యక్తులు జూదం నిర్వహిస్తున్నారనే సమాచారం అందడంతో ప్రత్యేక బృందం అక్కడికి చేరుకుని ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. పోలీసులను గమనించిన కొందరు తప్పించుకునే ప్రయత్నం చేసినప్పటికీ, ఆరుగురిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారి వద్ద జూదానికి ఉపయోగిస్తున్న నగదు, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో *లింగాల రాజు (35), బొంగోని సంతోష్ (43), బండారి భరత్ (30), కొడూరి గంగరాజు (36), పుల్లెల సంతోష్ (38), ఎనుగుల రాజమల్లు (43)*లను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితులపై తెలంగాణ గేమింగ్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. ఈ దాడిని ఆర్ఎస్ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీస్ కానిస్టేబుళ్లు వెంకట్, తిరుపతి, రాజయ్య సమన్వయంతో నిర్వహించారు. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జూదం, పేకాట, గ్యాంబ్లింగ్‌తో పాటు ఇతర అక్రమ కార్యకలాపాలకు పాల్పడేవారిపై ఇదే తరహా కఠిన చర్యలు కొనసాగుతాయని పోలీసులు స్పష్టం చేశారు. ప్రజలు తమ పరిసరాల్లో ఇలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా పోలీసు అధికారులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.




## పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి

- **నేరాల నియంత్రణకు సాంకేతికత, విజిబుల్ పోలీసింగ్‌ను బలోపేతం చేయాలి: ఎస్పీ అక్షాన్ష్ యాదవ్**

**భువనగిరి, జూలై 15 (ఆశ్వి ప్రతినిధి):**

జిల్లాలో నేరాల నియంత్రణతో పాటు పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నాణ్యమైన విచారణతో త్వరితగతిన పూర్తి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్, ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. భువనగిరి జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన జిల్లా నేరాల సమీక్ష సమావేశంలో జిల్లాలోని శాంతిభద్రతలు, పెండింగ్ కేసులు, సైబర్ నేరాలు, ట్రాఫిక్ భద్రత, సాంకేతిక వనరుల వినియోగంపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, విజిబుల్ పోలీసింగ్ను మరింత బలోపేతం చేయాలని, గ్రామస్థాయిలో ఇంటెలిజెన్స్ వ్యవస్థను పటిష్టం చేసి నేరాలను ముందుగానే అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. సమన్వయ్ (Samanvai) పోర్టల్, సీఈఐఆర్ (CEIR) పోర్టల్ సేవలను సమర్థవంతంగా వినియోగించి నేరాల నియంత్రణతో పాటు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల రికవరీని వేగవంతం చేయాలని తెలిపారు. అలాగే లా అండ్ ఆర్డర్, సీసీఎస్, సైబర్ సెల్, ఐటీ సెల్‌ల మధ్య సమన్వయం పెంచి కేసుల ఛేదనను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు భద్రతపై నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ట్రాఫిక్ నియమాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. గ్రామాల వారీగా సీసీటీవీ కెమెరాల నెట్‌వర్క్‌ను విస్తరించి సాంకేతిక ఆధారిత పోలీసింగ్‌ను బలోపేతం చేయాలని పేర్కొన్నారు. పెట్రోలింగ్, నాకాబందీలు, వాహన తనిఖీలను మరింత సమర్థవంతంగా నిర్వహించి నేరస్తుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని, సైబర్ నేరాల నియంత్రణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించాలని అధికారులకు సూచించారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, నాణ్యమైన పోలీసు సేవలు అందించడం ప్రతి పోలీసు అధికారి బాధ్యత అని పేర్కొన్న ఎస్పీ, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో ఎలాంటి రాజీ పడకుండా అంకితభావంతో పని చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌హెచ్‌వోలు, సీసీఎస్, సైబర్ సెల్, ఐటీ సెల్‌తో పాటు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## చిన్నకర్మకు వెళ్లిన మహిళపై దాడి..?

- **భర్త, కుమారులు విచక్షణారహితంగా కొట్టారంటూ నార్కెట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు**
- **ప్రాణహాని ఉందని ఆవేదన.. నిందితులపై కేసు నమోదు చేసి రక్షణ కల్పించాలని వినతి**

**నార్కెట్‌పల్లి, జూలై 13 (ఆశ్వి ప్రతినిధి):**

కుటుంబ కలహాలు తీవ్రరూపం దాల్చడంతో చిన్నకర్మ కార్యక్రమానికి హాజరైన మహిళపై ఆమె భర్త, కుమారులు కలిసి దాడి చేశారంటూ నల్గొండ జిల్లా నార్కెట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. తనను తీవ్రంగా కొట్టి గాయపరచడమే కాకుండా భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని బెదిరించారని బాధితురాలు ఆరోపించింది. ఈ మేరకు నిందితులపై భారతీయ న్యాయ సంహిత (BNS) ప్రకారం కేసు నమోదు చేసి తనకు రక్షణ కల్పించాలని కోరుతూ పోలీసులకు లిఖితపూర్వకంగా వినతిపత్రం సమర్పించింది.

బాధితురాలు బద్దుల యాదమ్మ ఫిర్యాదు ప్రకారం, గత కొంతకాలంగా తనకు భర్త బద్దుల మల్లేష్తో కుటుంబ విభేదాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 12వ తేదీన తమ బంధువుకు నిర్వహించిన చిన్నకర్మ కార్యక్రమానికి హాజరైన సమయంలో, భర్త బద్దుల మల్లేష్ తన ఇద్దరు కుమారులతో కలిసి తనపై ఉద్దేశపూర్వకంగా దాడి చేశారని ఆరోపించారు. విచక్షణారహితంగా కొట్టడంతో శారీరక గాయాలు అయ్యాయని, అడ్డుకునేందుకు ప్రయత్నించినప్పటికీ దాడిని ఆపలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

దాడి అనంతరం తనను అసభ్య పదజాలంతో దుర్భాషలాడుతూ, భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని బెదిరించారని, దీంతో తీవ్ర భయాందోళనకు గురయ్యానని బాధితురాలు పేర్కొన్నారు. ప్రస్తుతం తన ప్రాణాలకు ముప్పు ఉందని భావిస్తున్నానని, భవిష్యత్తులో మరోసారి దాడి జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ ఘటనపై నార్కెట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వక ఫిర్యాదు అందజేసిన బాధితురాలు, తన భర్త బద్దుల మల్లేష్‌తో పాటు దాడిలో పాల్గొన్న కుమారులు మరియు ఇతరులపై భారతీయ న్యాయ సంహిత (BNS)లోని సంబంధిత నిబంధనల ప్రకారం క్రిమినల్ కేసు నమోదు చేసి, పూర్తి స్థాయిలో విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే తన వ్యక్తిగత భద్రత దృష్ట్యా పోలీసు రక్షణ కల్పించాలని వినతిపత్రంలో అభ్యర్థించారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదును స్వీకరించిన అధికారులు ఘటనకు సంబంధించిన అన్ని కోణాల్లో విచారణ చేపట్టనున్నట్లు తెలిసింది. బాధితురాలు చేసిన ఆరోపణలపై విచారణ అనంతరం తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం



## పిల్లల ఆట నోట్లతో రూ.1 లక్ష మోసం.. ముగ్గురు అరెస్ట్

- **రూ.2 లక్షలు ఇస్తామని నమ్మించి టోకరా.. ఆట కరెన్సీ నోట్లు, నగదు, బైక్ స్వాధీనం**

**యాదాద్రి భువనగిరి, జూలై 15 (ఆశ్వి ప్రతినిధి):**

రూ.1 లక్ష ఇస్తే రూ.2 లక్షలు ఇస్తామని ఆశ చూపించి, పిల్లల ఆట కరెన్సీ నోట్లతో అమాయకుడిని మోసం చేసిన ముగ్గురు వ్యక్తులను యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు కేసును వేగంగా ఛేదించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, తుర్కపల్లి మండలానికి చెందిన ఓ వ్యక్తిని నిందితులు సంప్రదించి రూ.1 లక్షకు బదులుగా రూ.2 లక్షలు ఇస్తామని నమ్మించారు. బాధితుడు పల్లెపహాడ్ స్టేజ్ సమీపంలో రూ.1 లక్ష నగదు అందజేయగా, వారు ఇచ్చిన కట్టల్లో పై, కింది భాగాల్లో మాత్రమే అసలైన రూ.500 నోట్లు ఉంచి, మధ్యలో "Children's Bank of India - Specimen" అని ముద్రించిన పిల్లల ఆట కరెన్సీ నోట్లు పెట్టి పరారయ్యారు.

ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు *ముదురుకోల యాకంబరం (29), ముదురుకోల దేవేందర్ (38), మద్దెబోయిన నాగరాజు (34)*లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 16 కట్టల ఆట కరెన్సీ నోట్లు, రూ.10 వేల నగదు, హీరో హోండా ప్యాషన్ మోటార్‌సైకిల్, మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

ప్రధాన నిందితుడు యాకంబరం గతంలో కూడా నకిలీ కరెన్సీ కేసుల్లో అరెస్టై జైలుకు వెళ్లినట్లు విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు. సులభంగా రెట్టింపు డబ్బు వస్తుందనే ఆశతో ఇలాంటి మోసాలకు గురికావద్దని, అనుమానాస్పద వ్యక్తుల గురించి వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని జిల్లా ఎస్పీ ప్రజలకు సూచించారు.

## ఆడబిడ్డ సూసైడ్ చేసుకున్నా పట్టించుకోవటం లేదు

**తెలంగాణ బ్యూరో, ఆశ్వి అప్డేట్స్:**

పెద్ద రైస్ మిల్లర్లతో ప్రభుత్వం, ప్రతిపక్షాలు కుమ్మక్కయ్యాయని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. బుధవారం కవితతో రైస్ మిల్లర్లు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో వందల కోట్లతో వ్యాపారం చేసే బాయిల్డ్ రైస్ మిల్లర్ల జోలికి ఈ ప్రభుత్వం వెళ్లటం లేదని.. వాళ్ల నుంచి దాదాపు రూ.4 వేల కోట్లు ప్రభుత్వానికి రావాల్సి ఉన్నా ఏమీ అనటం లేదని అన్నారు. కానీ, 10 లక్షల నుంచి కోటి రూపాయల వరకు బకాయిలు ఉన్న చిన్న రైస్ మిల్లర్లను దొంగలను చూసినట్లు చూస్తున్నారని ఆరోపించారు. వారిపై ఎంక్వైరీ అంటూ కేసులు పెట్టి అరెస్ట్ చేస్తున్నారన్నారు. ఈ బాధ తట్టుకోలేక కరీంనగర్‌లో ఒక ఆడబిడ్డ సూసైడ్ చేసుకున్నదని తెలిపారు. అయినా.. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పట్టించుకోవటం లేదని ఆరోపించారు. గత ప్రభుత్వం దిగిపోయే సమయంలో లక్షా 40 వేల టన్నుల దొడ్డు బియ్యం ఉండేవని.. ఫిలిప్పీన్స్‌కు ఆ ప్రభుత్వం కిలో రూ.48 చొప్పున అమ్మిందన్నారు. కానీ.. ఈ ప్రభుత్వం ఇప్పుడు రూ.24కు అని టెండర్ పెట్టిందని.. కొన్ని రోజులకే మళ్లీ రూ.21.70కే దాన్ని అమ్మే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. దానికి సంబంధించి కరీంనగర్ కు చెందిన ఒక రైస్ మిల్లర్‌కు టెండర్ అప్పగించారని చెప్పారు. ఈ బియ్యానికి సంబంధించి కోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నదన్నారు.



## బ్రిక్స్ ప్రతినిధులకు సీఎం
# రేవంత్ రెడ్డి ఆతిథ్యం

- **ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ఘన విందు.. పలు దేశాల మంత్రులతో మర్యాదపూర్వక భేటీ**

**హైదరాబాద్, జూలై 15 (ఆశ్వి ప్రతినిధి):**

హైదరాబాద్‌లో జరుగుతున్న 12వ బ్రిక్స్ (BRICS) కార్మిక, ఉపాధి శాఖల మంత్రుల సదస్సు సందర్భంగా విదేశీ ప్రతినిధులకు ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక విందుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హాజరయ్యారు. కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ విందులో పాల్గొన్న బ్రిక్స్ దేశాల ప్రతినిధులను సీఎం ఆత్మీయంగా స్వాగతించి, వారితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా దక్షిణాఫ్రికా, ఇండోనేషియా, చైనా, రష్యా, ఇరాన్, ఇథియోపియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), బ్రెజిల్ దేశాల కార్మిక, ఉపాధి శాఖల మంత్రులతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమై పరస్పర అంశాలపై చర్చించారు. హైదరాబాద్‌లో జరుగుతున్న బ్రిక్స్ సదస్సుకు హాజరైన అతిథుల గౌరవార్థం కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ఈ విందును ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ, సహాయ మంత్రి శోభా కరంద్లాజే, రాష్ట్ర మంత్రులు వివేక్ వెంకటస్వామి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 'డయల్ యువర్ ఎస్పీ'కి విశేష స్పందన

- **25 ఫోన్ కాల్స్ ద్వారా ప్రజల సమస్యలు స్వీకరణ**
- **ప్రతి ఫిర్యాదుపై త్వరితగతిన చర్యలు: ఎస్పీ డాక్టర్ వినీత్**

**నారాయణపేట, జూలై 15 (ఆశ్వి ప్రతినిధి):**



నారాయణపేట జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'డయల్ యువర్ ఎస్పీ' కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్, ఐపీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం 25 ఫోన్ కాల్స్ ద్వారా ప్రజలు తమ సమస్యలను నేరుగా ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలు గుడుంబా తయారీ, బెల్ట్ షాపులు, అక్రమ మద్యం విక్రయాలు, భూ వివాదాలు, ట్రాఫిక్ సమస్యలు, గుట్కా విక్రయాలు, రాత్రి వేళల్లో గొడవలు, పెండింగ్ దొంగతనాల కేసులు, చీటింగ్ కేసులు, ఓపెన్ డ్రింకింగ్, రాత్రి పెట్రోలింగ్ పెంపు తదితర అంశాలపై ఫిర్యాదులు చేశారు. మరికల్ మండలం తిలేరు గేట్ వద్ద బ్యారికేడ్లు ఏర్పాటు చేయడం, రేడియం స్టిక్కర్లు అమర్చడం, నారాయణపేట పట్టణంలోని ఓల్డ్ బస్టాండ్, యాద్గిరి రోడ్, సరాఫ్ బజార్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరారు. ఉట్కూర్‌లో రౌడీషీటర్లు, కమ్యూనల్ షీటర్ల జాబితాలో అమాయకుల పేర్లు ఉన్నాయన్న ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరిపి అర్హుల పేర్లను తొలగిస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు. అలాగే మక్తల్‌లో కారు మిస్సింగ్, వెండి ఆభరణాల చోరీ, మద్దూరులో బెల్ట్ షాపులు, గొర్రెల చోరీ, భూ వివాదాలకు సంబంధించిన ఫిర్యాదులు కూడా అందాయి. ఒక కాలర్ ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ, ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారులకు వెంటనే పంపించి, నిష్పక్షపాత విచారణతో త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించినట్లు తెలిపారు. ప్రజలకు న్యాయం చేయడంలో పోలీసు శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, ఇలాంటి కార్యక్రమాలను తరచుగా నిర్వహించి పోలీసు శాఖను ప్రజలకు మరింత చేరువ చేస్తామని స్పష్టం చేశారు.



## సొసైటీ ఎన్నికల్లో విజేతలు.. టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన పాలకవర్గాలు

- **కాలనీల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని హామీ**

**మహేశ్వరం, జూలై 15 (ఆశ్వి ప్రతినిధి):**

మహేశ్వరం నియోజకవర్గంలోని రామకృష్ణాపురం డివిజన్ పరిధిలో ఇటీవల జరిగిన ఐటీడీఎస్ కోఆపరేటివ్ హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ (శ్రీ రామకృష్ణాపురం), అల్కాపురి కాలనీ పాలకవర్గ ఎన్నికల్లో విజయం సాధించిన నూతన కమిటీ సభ్యులు టీపీసీసీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులను భాస్కర్ రెడ్డి అభినందించి, ప్రజల విశ్వాసానికి అనుగుణంగా పారదర్శకంగా పనిచేయాలని సూచించారు. రామకృష్ణాపురం ఐటీడీఎస్ సొసైటీ, అల్కాపురి కాలనీల అభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని తెలిపారు.

రామకృష్ణాపురం ఐటీడీఎస్ సొసైటీ నూతన అధ్యక్షుడిగా బి. వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా రామస్వామి ఎన్నికయ్యారు. అల్కాపురి కాలనీ నూతన అధ్యక్షుడిగా శ్రీమన్నారాయణ, ఉపాధ్యక్షుడిగా వీరేందర్ బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ చిలుక ఉపేందర్ రెడ్డి, రామకృష్ణాపురం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూన్న గణేష్ నేత, ముప్పిడి లింగస్వామి గౌడ్, బొడ్డుపల్లి మహేందర్, జ్ఞానేశ్వర్ యాదవ్, భగత్, సొసైటీ కార్యదర్శి రామారావు, కోశాధికారి నరసింహారావు, సభ్యులు వెంకటరమణ, అన్నపూర్ణమ్మ, సత్యనారాయణ, సైదారావు, కృష్ణయ్య, శేషగిరిరావు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షా కాల వ్యాధుల నియంత్రణపై ప్రత్యేక దృష్టి

- **వైద్య, ఆరోగ్య శాఖ కార్యక్రమాల పురోగతిపై అదనపు కలెక్టర్ డా. కిరణ్మయి సమీక్ష**
- **అవసరమైన మందులు, పరీక్షా కిట్లు అందుబాటులో ఉంచాలని అధికారులకు ఆదేశం**

**కొంగర కలాన్, జూలై 15 (ఆశ్వి ప్రతినిధి):**




రంగారెడ్డి జిల్లాలో అమలవుతున్న వైద్య, ఆరోగ్య శాఖ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని అదనపు కలెక్టర్ డా. కిరణ్మయి అధికారులను ఆదేశించారు. కొంగర కలాన్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (IDOC) సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లాలో అమలవుతున్న తల్లిశిశు ఆరోగ్య సేవలు, జాతీయ టీకాల కార్యక్రమం, క్షయవ్యాధి నియంత్రణ, మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధుల నివారణ చర్యలు, కుటుంబ సంక్షేమ కార్యక్రమాలు, అసంక్రమిత వ్యాధుల నియంత్రణ, నేషనల్ డీవార్మింగ్ డే కార్యక్రమాల పురోగతిపై అధికారులతో సమీక్షించారు.

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, ప్రతి ప్రభుత్వ వైద్య సంస్థలో అవసరమైన మందులు, పరీక్షా కిట్లు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. జ్వరాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, ఇంటింటి సర్వేలు నిర్వహించడంతో పాటు ప్రజల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు.

అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా సమర్థవంతంగా అమలు చేసి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ సూచించారు.

ఈ సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా. స్వర్ణ కుమారి, ఉప జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారులు, జిల్లా స్థాయి కార్యక్రమాల అధికారులు, వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల నోడల్ అధికారులు, వైద్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి
# టీడబ్ల్యూజేఎఫ్ ఆందోళన

- **నేడు సమాచార పౌరసంబంధాల శాఖ కార్యాలయం ఎదుట ధర్నా**
- **అక్రిడిటేషన్లు, ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని డిమాండ్**

**హైదరాబాద్, జూలై 15 (ఆశ్వి ప్రతినిధి):**

రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) దశలవారీ ఆందోళనలను కొనసాగిస్తోంది. ఇందులో భాగంగా బుధవారం హైదరాబాద్‌లోని సమాచార, పౌరసంబంధాల శాఖ (ఐ అండ్ పీఆర్) రాష్ట్ర ప్రధాన కార్యాలయం ఎదుట 'ఛలో సమాచార్ భవన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ధర్నాకు పిలుపునిచ్చింది. టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు తెలిపిన వివరాల ప్రకారం, ఇప్పటికే జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించడం, కలెక్టరేట్ల వద్ద నిరసనలు చేపట్టడం వంటి కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ ప్రభుత్వం, అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాలేదని ఆరోపించారు. దీంతో రాష్ట్ర స్థాయిలో ఐ అండ్ పీఆర్ కార్యాలయం ఎదుట బహిరంగ నిరసన చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు.

ఈ సందర్భంగా జర్నలిస్టులకు కోటాలతో సంబంధం లేకుండా అర్హులందరికీ అక్రిడిటేషన్లు మంజూరు చేయడం, ఇళ్లు లేదా ఇంటి స్థలాల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయడం, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే హెల్త్ కార్డులు అందించడం, అలాగే ఆర్టీసీ బస్సులు, మెట్రో రైలులో పూర్తి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం వంటి ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఫెడరేషన్ కోరింది. ఈ ఆందోళనలో రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొని తమ హక్కుల సాధన కోసం సంఘీభావం తెలియజేయాలని టీడబ్ల్యూజేఎఫ్ నాయకత్వం పిలుపునిచ్చింది.

## జర్నలిస్టుల సంక్షేమంపై
# ప్రభుత్వం కట్టుబడి ఉంది

- **వెల్ఫేర్ ఫండ్‌పై వాస్తవాల వక్రీకరణ సరికాదు: తెలంగాణ మీడియా అకాడమీ**
- **సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత, వేగం పెరిగిందని స్పష్టం**

**హైదరాబాద్, జూలై 15 (ఆశ్వి ప్రతినిధి):**



తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమ నిధి అమలుపై ఇటీవల ప్రచురితమైన కథనాలు వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించడం లేదని తెలంగాణ మీడియా అకాడమీ స్పష్టం చేసింది. జర్నలిస్టుల సంక్షేమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని, పారదర్శకత, జవాబుదారీతనం, వేగం అనే మూడు ప్రధాన సూత్రాల ఆధారంగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపింది. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన తర్వాత జర్నలిస్టుల వెల్ఫేర్ ఫండ్ కార్యకలాపాలను మరింత క్రమబద్ధీకరించినట్లు పేర్కొంది. గతంలో ఎక్కువ విరామంతో జరిగే సంక్షేమ నిధి కమిటీ సమావేశాలను ప్రస్తుతం ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహిస్తూ, అందిన దరఖాస్తులను వేగంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకుంటున్నట్లు వెల్లడించింది. మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు సంబంధించిన అర్హత గల దరఖాస్తులు ప్రస్తుతం పెండింగ్‌లో లేవని పేర్కొంది. మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు ఆర్థిక సహాయం, ప్రమాదాలు లేదా శాశ్వత అంగవైకల్యానికి గురైన జర్నలిస్టులకు సహాయం, విద్యా సహాయం వంటి సంక్షేమ కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయని తెలిపింది. గతంలో రూ.50 వేలుగా ఉన్న తీవ్రమైన అనారోగ్యం, శాశ్వత అంగవైకల్యానికి సంబంధించిన ఆర్థిక సహాయాన్ని ప్రస్తుతం రూ.1 లక్షకు పెంచినట్లు వెల్లడించింది. జర్నలిస్టుల నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ ఆధునిక మీడియా ధోరణులు, డిజిటల్ జర్నలిజం, ఫ్యాక్ట్ చెకింగ్, కృత్రిమ మేధస్సు (AI), ఎన్నికల నిబంధనలు, మీడియా నైతిక విలువలపై చిన్న బ్యాచ్‌లుగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపింది. గిరిజన, ఉర్దూ, మహిళా జర్నలిస్టులతో పాటు సమాచార పౌరసంబంధాల శాఖ అధికారులకు కూడా ప్రత్యేక శిక్షణలు నిర్వహించినట్లు పేర్కొంది. వాస్తవాలను పూర్తిగా తెలుసుకోకుండా ప్రచురించే కథనాలు జర్నలిస్టుల్లో అపోహలు కలిగించే అవకాశం ఉందని పేర్కొంటూ, బాధ్యతాయుతమైన మీడియా విలువలకు అనుగుణంగా పూర్తి సమాచారం ఆధారంగా వార్తలు ప్రచురించాలని తెలంగాణ మీడియా అకాడమీ కార్యదర్శి విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని మరోసారి స్పష్టం చేశారు.

## బస్ టికెట్‌తో పాటే ఇంటికి ఈఆటో..
# టీజీఆర్టీసీ సరికొత్త సేవలు

- **హైదరాబాద్‌లో 'కాంబో' సర్వీస్‌కు శ్రీకారం.. ఒకే యాప్‌లో బస్, ఆటో బుకింగ్**

**హైదరాబాద్, జూలై 15 (ఆశ్వి ప్రతినిధి):**

ప్రైవేట్ ట్రావెల్స్‌కు పోటీగా ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందించేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఆర్టీసీ) కొత్తగా 'కాంబో' ఈఆటో సర్వీస్ ప్రారంభించేందుకు సిద్ధమైంది. ఈ సేవల ద్వారా బస్సు టికెట్ బుక్ చేసుకునే సమయంలోనే ఇంటి నుంచి బస్టాండ్‌కు లేదా బస్టాండ్ నుంచి ఇంటికి వెళ్లేందుకు అవసరమైన ఎలక్ట్రిక్ ఆటోను కూడా ఒకేసారి బుక్ చేసుకునే అవకాశం కల్పించనుంది.

ఈ సేవల కోసం టీజీఆర్టీసీ ప్రత్యేక మొబైల్ యాప్‌ను రూపొందిస్తోంది. ప్రయాణికులు ఒకే యాప్‌లో బస్సు టికెట్‌తో పాటు ఆటో సేవను కూడా ఎంపిక చేసుకుని, రెండు చార్జీలను ఒకేసారి చెల్లించే విధంగా వ్యవస్థను అందుబాటులోకి తీసుకురానుంది. ప్రారంభ దశలో ఈ కాంబో ఈఆటో సేవలను హైదరాబాద్ నగరంలో అమలు చేయనున్నారు. ప్రయాణికులకు చివరి మైలు (లాస్ట్ మైల్) కనెక్టివిటీని మెరుగుపరచడంతో పాటు ప్రైవేట్ ట్రావెల్స్‌తో పోటీపడే లక్ష్యంతో టీజీఆర్టీసీ ఈ వినూత్న సేవలను ప్రవేశపెడుతోంది. కొత్త సేవలతో ప్రయాణికులకు మరింత సులభమైన, సమయాన్ని ఆదా చేసే ప్రయాణ అనుభవం లభించనుంది.




## రేవంత్ పాలనలో హైదరాబాద్
# ఐటీ రంగం దిగజారుతోంది..

**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్**

హైదరాబాద్ అనగానే ఒకప్పుడు చార్మినార్ గుర్తొచ్చేదని... ఇప్పుడు ఐటీ, ఫార్మా పరిశ్రమలకు హైదరాబాద్ పేరుగాంచిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ కుమార్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ, వేగంగా పురోగమిస్తున్న నగరాలలో హైదరాబాద్ ఒకటిగా ఉన్న పరిస్థితి నుంచి రేవంత్ పాలనలో దిగజారే దాకా వెళుతోందన్నారు. 2014లో 50 వేల కోట్ల రూపాయలు ఉన్న ఐటీ ఎగుమతులను 2023లో 2 లక్షల కోట్లు దాటేలా కేటీఆర్ శ్రమించారు. 3 లక్షల ఐటీ ఉద్యోగాల స్థాయి నుంచి కేటీఆర్ 9 లక్షల ఐటీ ఉద్యోగాల స్థాయికి హైదరాబాద్‌ను మార్చారని గుర్తు చేశారు. ఇప్పుడు అందరూ సిగ్గుపడేలా పరిస్థితి మారిందన్నారు.

రేవంత్ రెడ్డి 18 గంటలు కష్టపడి ఐటీ పరిశ్రమను చంపేసే పని చేస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్‌కు కాగ్నిజెంట్ రాంరాం అన్నదని... 15 వేల నుంచి 20 వేల ఉద్యోగాలు కల్పించే కాగ్నిజెంట్ విశాఖకు తరలుతోందని ఆరోపించారు. కాగ్నిజెంట్‌ను రెండు చోట్ల విస్తరించేలా గతంలో రెండు ఎంఓయూలు కుదిరాయి. అయినా కాగ్నిజెంట్ హైదరాబాద్ నుంచి విశాఖకు మారుతోందన్నారు. 7 వేల ఐటీ ఉద్యోగాలు తగ్గాయని భట్టి విక్రమార్క అసెంబ్లీలోనే చెప్పారని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి ఉద్యోగాలను మింగేస్తున్నారని, కేటీఆర్ సగటున 60 వేల ఉద్యోగాలు పెంచితే రేవంత్ రెడ్డి 6 వేల ఉద్యోగాలు తగ్గిస్తున్నారన్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తాం: ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

- **లింగంపల్లి గేటు వద్ద 96 డబుల్ బెడ్‌రూం ఇళ్ల ధ్రువీకరణ పత్రాల పంపిణీ**
- **పూరిగుడిసెలు లేని గ్రామాలే లక్ష్యమని స్పష్టం**

**ఇబ్రహీంపట్నం, జూలై 15 (ఆశ్వి ప్రతినిధి):**

పూరిగుడిసెలు, పెంకుటిళ్లు లేని గ్రామాలను నిర్మించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు అందించే బాధ్యత తమదేనని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంచాల మండలం లింగంపల్లి గేటు వద్ద నిర్మించిన 96 డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులకు బుధవారం ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు.

ఇబ్రహీంపట్నంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నోముల, మంచాల, లింగంపల్లి గ్రామాలకు 30 చొప్పున, చెన్నారెడ్డిగూడెంకు చెందిన ఆరుగురు లబ్ధిదారులకు ఇళ్ల ధ్రువీకరణ పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు, గ్రామస్థులు హాజరయ్యారు.



ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత పదేళ్లలో పేదలకు ఇళ్లు, రేషన్ కార్డులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని కేంద్రంగా పెట్టుకుని నిర్ణయాలు తీసుకుంటోందని చెప్పారు. ప్రపంచం దృష్టిని ఆకర్షించేలా ఫ్యూచర్ సిటీ నిర్మాణంతో పాటు ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో ఎలాంటి రాజకీయ జోక్యం ఉండదని, గూడు లేని అర్హులకే ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు. నియోజకవర్గ అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నాలను సహించబోమని పేర్కొంటూ, పేదలకు ప్రభుత్వ భూములు అందించే కార్యక్రమాన్ని కొందరు అడ్డుకునేందుకు కోర్టులను ఆశ్రయిస్తున్నారని ఆరోపించారు. లింగంపల్లి గేటు వద్ద నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లలో తాగునీరు, విద్యుత్, రహదారులు, పారిశుద్ధ్యం తదితర అన్ని మౌలిక సదుపాయాలను కల్పించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.



## మంగు మచ్చలకు ఇంటి చిట్కా

చాలామంది ముఖంపై, కళ్ల చుట్టు, ముక్కు మీద మంగు మచ్చలు ఏర్పడుతుంటాయి. వాటిని పోగొట్టుకోవాలంటే.. ఈ చిట్కా పాటించండి.

కలబంద గుజ్జు, రోజ్ వాటర్ సమపాళ్లలో తీసుకుని కలపాలి. అందులో రెండు చుక్కల నిమ్మరసాన్ని కలపాలి. ఈ మూడింటినీ బాగా కలిపి పేస్ట్ చేసి మంగు మచ్చల మీద పూయాలి. పది నిమిషాల తర్వాత నీటితో కడగాలి. ఇలా వారానికి మూడుసార్లు చేస్తే సరి. అయితే ఈ చిట్కా పాటించేటప్పుడు ఎండ తగలకూడదు. హెయిర్ డ్రై లాంటివి వాడకూడదు. కచ్చితంగా వేసుకోవాల్సి వస్తే మంగు మచ్చలపై మాయిశ్చరైజర్ లేదా పాల మీగడ పూసుకోవాలి.



## పని ఒత్తిడి.. ఆడవాళ్లకే ఎక్కువ



ఈ రోజుల్లో ఒత్తిడి లేనిది ఎవరికి? చిన్నపిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు.. అందరికీ కామన్ అయిపోయింది. అయితే, ఇంట్లో ఉండే ఒత్తిడి వేరు. పని చేసే చోట ఉండే ఒత్తిడి వేరు. మగవారితో పోలిస్తే ఆడవాళ్లు ఎక్కువగా పని ఒత్తిడికి గురవుతున్నారు. ఈ విషయం తాజాగా యువర్ దోస్త్ అనే సంస్థ చేసిన స్టడీలో తేలింది.

'ఎమోషనల్ వెల్‌నెస్ స్టేట్ ఆఫ్ ఎంప్లాయిస్' పేరుతో యువర్ దోస్త్ అనే సంస్థ ఐదు వేలమందిపై చేసిన సర్వేలో తెలిసింది. ఇదే కాదు ఇప్పటికే చాలా అధ్యయనాలు ఈ విషయాన్ని చెప్పాయి. ఎందుకు ఆడవాళ్లు అంతగా ఒత్తిడికి గురవుతున్నారంటే.. కుటుంబ బాధ్యతలు, ఆఫీసు పనుల భారం మధ్య సమన్వయం చేసుకోవడంలో ఇబ్బందులు మొదటి కారణం. ఆ తర్వాత బాధ్యతలు పెరగడం, రోజూవారీ పనులు పూర్తి కాకపోవడం, కో– ఆర్డినేషన్ లేనప్పుడు, పోటీతత్వం, చాడీలు, అదనపు పని భారం, అతి విశ్వాసం.. ఇవన్నీ ఒత్తిడికి కారణాలే. ఇవి శారీరకంగా, మానసికంగా దెబ్బతీస్తాయి.




### ఇలా తగ్గుతుంది

- పని చేసే చోటు ఆహ్లాదకర వాతావరణంలో సౌకర్యంగా ఉండాలి. అలా లేకపోతే అందుకు తగ్గట్లు మార్చుకోండి.
- ఎంత పని ఉన్నా.. చిన్న విరామం అవసరం. గంటకోసారైనా లేచి అటు ఇటూ తిరగాలి.
- ఒత్తిడిలో ఉంటే కాఫీ, టీలకు బదులు ఓ కప్పు గోరు వెచ్చని నీళ్లు లేదంటే గ్రీన్‌టీ తాగండి.
- ఒత్తిడి కారణంగా కొందరు ఏది పడితే అది తినేస్తారు. కానీ, అది సరికాదు. దానిబదులు ఒమెగా త్రీ ఫ్యాటీ యాసిడ్స్ ఉంటే అవిసె గింజలు, వాల్ నట్స్, సీడ్స్ వంటివి తినాలి. ఆ యాసిడ్స్ నేచురల్గా ఒత్తిడిని తగ్గించడంలో సాయపడతాయి. దాంతో మనసు ప్రశాంతంగా ఉంటుంది.
- సరైన ప్రణాళిక వేసుకుంటే పనులు త్వరగా పూర్తి అవుతాయి. దీంతో పాటు యోగా, ధ్యానం వంటివి చేయాలి.

# అతి చేస్తే.. అధోగతి! ఆమె కథే.. ఉదాహరణ

అసలు ఐఏఎస్ అంటే.. అదొక పర్వతం లాంటిది. దాన్ని ఢీ కొట్టాలంటే సాదాసీదాగా చదివితే సరిపోదు. దీక్ష, పట్టుదల, తపన, నిరంతర అధ్యయనం, అంకితభావం.. ఇలా అన్నీ ఉండాలి. అప్పడే శ్రద్ధగా, ఏకాగ్రతతో చదవగలరు. అలా రాత్రనక.. పగలనక.. గంటలు గంటలు నిరాటంకంగా చదివి ఐఏఎస్ పరీక్ష రాస్తారు. వంద మంది పోటీ పడితే.. పదుల సంఖ్యలో నెగ్గుకొస్తారు. అంత కష్టపడితే గానీ ఐఏఎస్ కావాలన్న ఆశ నెరవేరుతుంది. ఒక పేద విద్యార్థి ఎంత కష్టపడితే ఆ స్థాయికి వెళ్లగలడో "12th ఫెయిల్" అనే సినిమాలో చక్కగా చూపించారు. తినడానికి తిండి లేక, ఊరుకాని ఊరిలో పొట్టకూటికి తిప్పలు పడుతూ, చదివి ఐఏఎస్ సాధిస్తాడు. అది ఒక సినిమా కాదు. అదొక బయోపిక్. నిజంగా అలాంటి ఐఏఎస్లు మన మధ్య ఉన్నారు. కానీ, ఇదే సమాజంలో పూజ ఖేద్కర్ లాంటివాళ్లు కూడా ఉన్నారని ఈ మధ్యనే తెలిసింది.

ఆర్థికంగా సపోర్ట్ ఉన్న కుటుంబం నుంచి వచ్చిన వాళ్లు ఐఏఎస్ కావాలంటే.. తెలివి, సామర్థ్యం, తపన వంటివి ఉంటే చాలు. అది అయినా తమ సొంత కష్టం టాలెంట్ తోనే సాధ్యపడుతుంది. కానీ, లక్ష్యానికి అడుగు దూరంలో ఉన్నప్పుడు ఇంకా ఓర్పుతో, నేర్పుతో మసలుకోవాలి. ఇవన్నీ తెలియకుండానే ఐఏఎస్ వరకు వెళ్లిపోతారా? అంటే.. పూజను చూస్తే అలానే అనిపిస్తుంది. ఇప్పుడు ఐఏఎస్ పరీక్షలకు సిద్ధమయ్యేవాళ్లకు, ఆల్రెడీ ట్రైనీలుగా ఉన్న ఐఏఎస్లకు పూజా ఖేద్కర్ స్టోరీ ఒక వార్నింగ్ బెల్ లాంటిది. అసలు ఇంతకీ ఆమె ఎవరు ఏం చేసింది? ఫలితంగా ఏం అనుభవిస్తుందో వివరంగా తెలుసుకుందాం.



మహారాష్ట్రకు చెందిన 34 ఏండ్ల పూజా ఖేద్కర్.. ప్రొబెషనరీ ఐఏఎస్ అధికారిగా విధులు నిర్వహించేది. ఆ స్థాయికి వెళ్లిందంటే టాలెంట్ ఉందనే అనుకుంటారు అంతా. కానీ, ఆమె టాలెంట్ ఎందులో చూపించిందంటే.. ట్రైనీకి, అధికారికి తేడా తెలుసుకోకుండా గొంతెమ్మ కోరికలు కోరడం మొదలుపెట్టింది. ఐఏఎస్ అధికారికి ఉండే సౌకర్యాలు ట్రైనీగా ఉన్న తనకూ కల్పించాలని డిమాండ్ చేసింది. దాంతో వివాదాల్లోకి వచ్చింది పూజ.

### అమ్మానాన్నలు కూడా..

అసలే వివాదాల్లో చిక్కుకుంది కూతురు. ఈ నేపథ్యంలో ఆమెకి సపోర్ట్ నిలిచారు ఆమె తల్లి దండ్రులు. తన కూతురు చేసింది తప్పు కాదని, ఆమె అడిగినవన్నీ చేసి పెట్టమన్నారు. అయితే, ఆమె తల్లి భూవివాదంలో ఒక రైతును తుపాకీతో బెదిరించి క్రిమినల్ కేసులో ఇరుక్కుంది. దీంతో పాటు పుణెకి సమీపంలో నిర్వహిస్తున్న ఇంజినీరింగ్ పరిశ్రమ దాదాపు రెండు లక్షల ఆస్తిపన్ను కట్టని కారణంగా పింప్రీ – చించ్వాడ్ పురపాలక అధికారులు సీజ్ చేశారు.

### పేర్లు మార్చి.. మాయ చేసి

ఆమె నకిలీ పత్రాలతో యూపీఎస్సీ క్లియర్ చేసింది. ఈ నేపథ్యంలో 2009 నుంచి 2023 వరకు 15 వేల మందికి పైగా ఐఏఎస్ అభ్యర్థుల వివరాలు మళ్లీ పరిశీలిస్తే.. సీఎస్ఈ నిబంధనల ప్రకారం అనుమతించిన దానికంటే ఎక్కువసార్లు ఆమె సివిల్ సర్వీసెస్ పరీక్షలు రాసినట్టు తేలింది. అలా రాసిన అభ్యర్థులు ఎవరూ లేనే లేరు. అందుకోసం పూజ తన పేరుతోపాటు తన అమ్మానాన్నల పేరును కూడా మార్పు చేసింది. అలా చాలాసార్లు సివిల్స్ రాసింది. మోటారు వెహికల్స్ చట్టాన్ని ఉల్లంఘించి కారుకు సైరన్, మహారాష్ట్ర ప్రభుత్వ స్టిక్కర్, వీఐపీ నెంబర్ ప్లేట్లను వాడింది. 21 సార్లు ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించింది. ఆమె నాన్ క్రిమిలేయర్, వైద్య ధ్రువీకరణలు కూడా వివాదస్పదం అయ్యాయి.



### చాప్టర్ క్లోజ్

ఈ వివాదం నేపథ్యంలో ప్రొబెషన్ నిలిపి వేసి, ముస్సోరిలోని లాల్ బహదూర్ శాస్త్రి జాతీయ అకాడమీకి తిరిగి రావాలని కోరితే అక్కడికీ వెళ్లలేదు. ఇలా తప్పు మీద తప్పు చేస్తూ పోయింది పూజ. ఇప్పటికే ఆమెపై ఫోర్జరీ కేసు కూడా నమోదయ్యింది. దాంతోపాటు యూపీఎస్సీ అభ్యర్థిత్వాన్ని రద్దు చేసింది. జులై 25లోగా నోటీసులకు సమాధానం ఇవ్వమని యూపీఎస్సీ ఆదేశాలిచ్చింది. కానీ ఆమె ఆగస్టు 4 వరకు గడువు కావాలని కోరింది. అందుకు తిరస్కరించి జులై 30 వరకు గడువు ఇచ్చింది. ఇదే చివరి అవకాశం అని స్పష్టం చేసింది. అయినా ఆమె తన సమాధానాన్ని సమర్పించలేదు. అందువల్ల సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్ 2022లో ఆమె అభ్యర్థిత్వాన్ని రద్దు చేశారు. భవిష్యత్తులో రాయకుండా శాశ్వతంగా డిబార్ చేశారు.

ఇదిలా ఉంటే ప్రస్తుతం పూజ అందుబాటులో లేదని, దుబాయ్ పారిపోయిందనీ వార్తలు వస్తున్నాయి.

**"అతిగా ఆశపడే ఆడది.. అతిగా ఆవేశపడే మగవాడు సుఖపడినట్లు చరిత్రలో లేదు" సూపర్ స్టార్ రజనీ కాంత్ చెప్పిన ఈ డైలాగ్ ఎంత పాపులర్ అయిందో తెలుసు. నరసింహా అనే సినిమాలో రమ్యకృష్ణ పాత్రకు తగ్గట్టు రాసిన ఈ డైలాగ్.. వివాదాస్పద ట్రైనీ ఐఏఎస్ పూజా ఖేద్కర్కు సరిగ్గా సరిపోతుంది. అర్హతకు మించి గొంతెమ్మ కోరికలు కోరితే జీవితం తల్లకిందులు అవుతుందనడానికి ఆమె కథే ఉదాహరణ. విలాసాల కోసం అడ్డదారులు తొక్కే వాళ్లకు ఈమె స్టోరీనే గుణపాఠం.**



## నాలో బ్యాటింగ్ సామర్థ్యాన్ని వెలికి తీసింది ఆ ఇద్దరే: వాషింగ్టన్ సుందర్

ఇంగ్లాండ్‌తో తొలి వన్డేలో భారత ఆటగాళ్లు అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్ హాఫ్ సెంచరీలతో మెరిశారు. యూకే పర్యటనలో టీమ్ఇండియా తొలి విజయంలో వీరిద్దరిది కీలక పాత్రే. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ రిటైర్డ్ హర్ట్ కావడంతో.. సుందర్ (52*) థర్డ్ డౌన్‌లో బ్యాటింగ్‌కు వచ్చాడు. కేఎల్ రాహుల్ విఫలమైనా.. అక్షర్(57*)తో కలిసి మ్యాచ్‌ను ముగించాడు. తన ఆటతీరు వెనక ఇద్దరు వ్యక్తులు ఉన్నారని సుందర్ వెల్లడించాడు.

‘‘భిన్నమైన పరిస్థితుల్లో.. భిన్నమైన ప్లేస్‌మెంట్‌లో బ్యాటింగ్‌కు వస్తున్నా. ఇలాంటి అవకాశం అందరికీ రాదు. జట్టు విజయం కోసం నావంతు సహకారం అందించేందుకు ప్రయత్నిస్తున్నా. రెండేళ్ల కిందటే గంభీర్ నా బ్యాటింగ్ పాత్రపై ఓ స్పష్టత ఇచ్చాడు. నేనేం చేయగలనో అర్థమయ్యేలా చెప్పాడు. గుజరాత్ టైటాన్స్ కోచ్ ఆశిశ్ నెహ్రా కూడా అంతే. నేను మెరుగైన ఆటతీరు ప్రదర్శించడానికి వీరిద్దరే ప్రధాన కారణం. ఆల్‌రౌండర్‌గా ప్రతి రోజూ మెరుగు కావడానికి ప్రయత్నిస్తా. పరిస్థితులకు అనుగుణంగా ఆడాల్సిన అవసరం ఉంటుంది. నా నైపుణ్యంపై నమ్మకం ఉంచిన మేనేజ్‌మెంట్‌కు ధన్యవాదాలు. శుభ్‌మన్ శ్రేయస్ మంచి భాగస్వామ్యం అందించారు. అక్షర్ పటేల్‌తో కలిసి దానిని ముందుకు తీసుకెళ్లా. గిల్ గాయంపై నాకైతే సమాచారం లేదు’’ అని సుందర్ తెలిపాడు.

**నాకు చాలా ముఖ్యం: అక్షర్ పటేల్**

‘‘ఇలాంటి ప్రదర్శన నాకు చాలా ముఖ్యం. టీ20 సిరీస్‌లో బంతిని హిట్టింగ్ చేసేందుకే ప్రయత్నించా. అక్కడ నేను అనుకున్నట్లు ఆడలేకపోయా. డెత్ ఓవర్లలో బ్యాటింగ్‌కు వెళ్లినప్పుడు మనకు ఎలాంటి ఆప్షన్లు ఉండవు. భారీ షాట్లకు వెళ్లాల్సిందే. ఇప్పుడు వన్డే సిరీస్‌లో మంచి ఆరంభం దొరికింది. ఇక్కడ టైమింగ్ కీలకం. దానిని పక్కాగా అమలు చేయగలిగా’’ అని అక్షర్ (Axar Patel) వెల్లడించాడు.

# టీ20, వన్డే ప్రపంచ-కప్ ఫార్మాట్లలో పలు మార్పులు..

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ తన వార్షిక సమావేశంలో క్రికెట్ ప్రేమికులకు సరికొత్త అనుభూతిని పంచేలా కీలక నిర్ణయాలు తీసుకుంది. ఆటలో మరింత ఉత్కంఠను పెంచేందుకు, ప్రపంచవ్యాప్తంగా మరిన్ని దేశాలకు ప్రాతినిధ్యం కల్పించేందుకు వన్డే, టీ20 ప్రపంచకప్ ఫార్మాట్లలో భారీ మార్పులను ప్రవేశపెట్టింది. ప్రధానంగా 2027 వన్డే ప్రపంచకప్, 2028 టీ20 ప్రపంచకప్‌ల నిర్వహణ తీరును మార్చడం ద్వారా టోర్నీలను మరింత రసవత్తరంగా మార్చనుంది.

**2027 వన్డే ప్రపంచకప్: 14 జట్లు, 3 దశలు**

2027లో దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియాలు సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న వన్డే ప్రపంచకప్‌లో మొత్తం 14 జట్లు పాల్గొనబోతున్నాయి. ఈ టోర్నీని మూడు విభిన్న దశల్లో నిర్వహించనున్నారు.

గ్రూప్ స్టేజ్: పాల్గొనే 14 జట్లను ఒక్కో గ్రూపులో ఏడేసి జట్ల చొప్పున రెండు గ్రూపులుగా విభజిస్తారు. లీగ్ దశలో ప్రతి జట్టు తమ గ్రూప్‌లోని మిగిలిన జట్లతో తలపడుతుంది.

సూపర్ సిక్స్: రెండు గ్రూపుల నుండి మొదటి మూడు స్థానాల్లో నిలిచిన మొదటి ఆరు జట్లు ‘సూపర్ సిక్స్’ దశకు అర్హత సాధిస్తాయి.

నాకౌట్ (సెమీఫైనల్స్ & ఫైనల్): సూపర్ సిక్స్ గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచిన నాలుగు జట్లు సెమీఫైనల్స్‌కు చేరుకుంటాయి. అక్కడ విజయం సాధించిన రెండు జట్లు ఫైనల్‌లో టైటిల్ కోసం తలపడతాయి. 2003 ప్రపంచకప్ ఫార్మాట్‌ను పోలిన ఈ విధానం ద్వారా టోర్నీ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగనుంది.

2028 టీ20 ప్రపంచకప్: ‘సూపర్10’ ఫార్మాట్

పొట్టి ఫార్మాట్‌కు ఉన్న ఆదరణను మరింత పెంచేందుకు 2028 టీ20 ప్రపంచకప్‌లో ఐసీసీ సరికొత్త ‘సూపర్10’ (Super10) దశను ప్రవేశపెట్టనుంది.

గతంలో ఉన్న ‘సూపర్8’ స్థానంలో దీనిని తీసుకువచ్చారు. దీనివల్ల అసోసియేట్ దేశాలకు బలమైన జట్లతో తలపడే మరిన్ని అవకాశాలు లభిస్తాయి. గ్రూప్ దశ దాటి వచ్చిన అత్యుత్తమ పది జట్లను రెండు గ్రూపులుగా విభజించి లీగ్ మ్యాచ్‌లు నిర్వహిస్తారు. ఆయా గ్రూపులలో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు నేరుగా సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తాయి.

ఈ మార్పులు ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ విస్తరణకు, చిన్న జట్లలో నైపుణ్యాన్ని మెరుగుపరచడానికి ఎంతో దోహదపడతాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఐసీసీ తీసుకున్న ఈ వినూత్న నిర్ణయాలు క్రీడా వర్గాల్లో, అభిమానుల్లో భారీ అంచనాలను పెంచుతున్నాయి.




# హనుమంతుడి ఆశీస్సులు తీసుకొని నెట్స్‌లోకి వైభవ్



ఇంగ్లండ్ పర్యటన ముగించుకుని భారత్‌కు తిరిగి వచ్చిన యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ మళ్లీ సాధనలో నిమగ్నమయ్యాడు. రాజస్థాన్ రాయల్స్ హై పెర్ఫార్మెన్స్ సెంటర్‌లో అతను శిక్షణ ప్రారంభించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ప్రాక్టీస్ ప్రారంభించే ముందు హనుమంతుడి ఆశీస్సులు తీసుకున్న వైభవ్, అనంతరం నెట్స్‌లో దూకుడుగా బ్యాటింగ్ చేస్తూ అందరి దృష్టిని ఆకర్షించాడు. రాజస్థాన్ రాయల్స్ తమ అధికారిక సోషల్ మీడియా ఖాతాలో ఈ వీడియోను ‘Back to Work’ అనే క్యాప్షన్‌తో పంచుకుంది. వీడియోలో వైభవ్‌కు జట్టు ఆటగాళ్లు, సహాయక సిబ్బంది గౌరవ వందనం ఇవ్వడం కనిపిస్తుంది. రెండు వరుసలుగా నిలబడి అతనికి స్వాగతం పలకగా, చిరునవ్వుతో వారందరి మధ్య నుంచి నడుచుకుంటూ వచ్చిన వైభవ్ నేరుగా ప్రాక్టీస్‌కు వెళ్లాడు. నెట్స్‌లో అతను శక్తివంతమైన షాట్లతో ఆకట్టుకున్నాడు. ముఖ్యంగా అభిమానులు “హెలికాప్టర్ షాట్”గా గుర్తించే షాట్‌ను ఆడుతూ తన టైమింగ్, ఫుట్‌వర్క్, దూకుడు బ్యాటింగ్‌ను ప్రదర్శించాడు. ఇంగ్లండ్ పర్యటనలో షార్ట్ బాల్స్‌ను ఎదుర్కోవడంలో ఇబ్బందులు ఎదుర్కొన్న నేపథ్యంలో, ప్రస్తుతం అదే బలహీనతను అధిగమించేందుకు ప్రత్యేకంగా సాధన చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఇంగ్లండ్ పర్యటనలో వైభవ్ భారత జట్టు తరఫున టీ20 అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. అయితే, మూడు మ్యాచ్‌ల్లో 14, 13, 15 పరుగులకే పరిమితమయ్యాడు. మంచి ఆరంభాలు లభించినప్పటికీ వాటిని భారీ స్కోర్లుగా మలచలేకపోయాడు. ముఖ్యంగా షార్ట్ బాల్స్‌ను ఎదుర్కొనే విషయంలో అతని బ్యాటింగ్‌పై విమర్శలు రావడంతో ఇప్పుడు ఆ లోపాలను సరిదిద్దుకునే ప్రయత్నంలో ఉన్నాడు.

ఇక వైభవ్ తదుపరి సవాలు జింబాబ్వే పర్యటన. జూలై 23 నుంచి ప్రారంభమయ్యే మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో అతను భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఇంగ్లండ్ పర్యటనలో ఎదురైన నిరాశను మరచి, ఈ సిరీస్‌లో భారీ ఇన్నింగ్స్ ఆడి తన ప్రతిభను నిరూపించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. రాజస్థాన్ రాయల్స్ పంచుకున్న వీడియోకు అభిమానుల నుంచి భారీ స్పందన వస్తోంది. యువ బ్యాటర్‌పై ఫ్రాంచైజీకి ఉన్న నమ్మకం, అతని కష్టపడే తత్వం ఈ వీడియోలో స్పష్టంగా కనిపిస్తున్నాయని నెటిజన్లు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పుడు అందరి దృష్టి జింబాబ్వే సిరీస్‌లో వైభవ్ ఎలా రాణిస్తాడన్న దానిపైనే ఉంది.



## అవును.. నేను సిద్ధమే

భారత మహిళా జట్టుకు వన్డే ప్రపంచ కప్ కలను నెరవేర్చిన సారథి హర్మన్‌ప్రీత్ కౌర్. అయితే, కప్పును సాధించడంలో ఓపెనర్ స్మృతి మంధాన అద్భుత ఆటతీరు కూడా కీలకమే. కానీ, గత టీ20 వరల్డ్ కప్‌లో భారత మహిళా జట్టు గ్రూప్ స్టేజ్‌కే పరిమితమైంది. తాజాగా లార్డ్స్ వేదికగా జరిగిన మొదటి టెస్టు మ్యాచ్‌లో ఇంగ్లాండ్‌ను చిత్తు చేసింది. వైస్ కెప్టెన్ స్మృతి మంధాన రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ హాఫ్ సెంచరీలు చేసి సత్తా చాటింది. ఈ క్రమంలో 37 ఏళ్ల హర్మన్‌ప్రీత్ ఆటకు వీడ్కోలు పలికే అవకాశాలు ఎక్కువ ఉన్నట్లు వార్తలు వచ్చాయి. దీంతో తదుపరి టీమ్ఇండియా సారథి రేసులో స్మృతి మంధాన ముందు వరుసలో ఉంది.

‘‘అవును.. నేను పూర్తిస్థాయి సారథ్యం చేపట్టేందుకు సిద్ధంగానే ఉన్నా’’ అని మంధాన తెలిపింది. గత పదేళ్లుగా హర్మన్‌తో కలిసి స్మృతి భారత జట్టుకు పిల్లర్‌గా మారింది. డ్యాషింగ్ ఓపెనింగ్‌తో అభిమానులను అలరిస్తోంది. హర్మన్ గైర్హాజరీలో మంధాన ఇప్పటికే 18 టీ20లు, నాలుగు వన్డేల్లో టీమ్ఇండియాను నడిపించింది. రెండు ఫార్మాట్లలో కలిపి మొత్తం 15 మ్యాచుల్లో భారత జట్టును గెలిపించింది.

**భాగం కావడం అద్భుతం..**

‘‘లార్డ్స్ వేదికగా జరిగిన తొలి మహిళా టెస్టులో భారత్ ఘన విజయం సాధించింది. ఈ జట్టులో భాగస్వామ్యం కావడం అద్భుతంగా అనిపిస్తోంది. ఇందులో నా వంతు సహకారం ఉండటం మరింత సంతోషాన్నిస్తోంది. లార్డ్స్‌లో టెస్టు క్రికెట్ అనేది చిన్నప్పటి కల. ఇప్పుడు మేం గెలిచి చూపించాం. ఎప్పటికీ మరిచిపోలేని జ్ఞాపకం’’ అని స్మృతి మంధాన తెలిపింది.



## ఐసీసీ వన్డే ర్యాంకులు.. అగ్రస్థానంపై శుభ్‌మన్ గిల్ గురి!

ఇంగ్లాండ్‌పై అద్భుత ఇన్నింగ్స్ ఆడిన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (80*) ఐసీసీ ర్యాంకుల్లోనూ అగ్రస్థానంపై గురి పెట్టాడు. ప్రస్తుతానికి తన ర్యాంకింగ్‌లో మార్పు లేకపోయినా.. రేటింగ్‌లో మాత్రం ముందుకు దూసుకొచ్చాడు. మరోవైపు అతడికి న్యూజిలాండ్ ఆటగాడు డారిల్ మిచెల్ నుంచి తీవ్ర పోటీ ఎదురవుతోంది. ప్రస్తుతం అతడే 814 పాయింట్లతో టాప్ ర్యాంక్ (ICC Top Rank)లో ఉన్నాడు. శుభ్‌మన్ గిల్ 803 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచాడు. ఒక్క మ్యాచ్‌తో గిల్ ఖాతాలోకి 12 పాయింట్లు వచ్చి చేరాయి. మిగిలిన రెండు మ్యాచుల్లోనూ మెరుగైన ఆటతీరు ప్రదర్శిస్తే గిల్ (Shubman Gill)కే అగ్రస్థానం దక్కే అవకాశం ఉంది. వీరిద్దరి తర్వాత భారత సీనియర్ ప్లేయర్లు విరాట్ కోహ్లీ (757), రోహిత్ శర్మ (744) మూడు, నాలుగు ప్లేసుల్లో కొనసాగుతున్నారు. ఇంగ్లాండ్‌తో తొలి వన్డేలో నిరాశపరిచిన రోకో.. మిగిలిన మ్యాచుల్లో విఫలమైతే తమ ర్యాంకులకు ప్రమాదం ఎదుర్కోక తప్పదు.


**బౌలర్లలో ఒకే ఒక్కడు..**

బౌలర్ల జాబితాలో టీమ్ఇండియా (Team India) నుంచి టాప్ 10లో ఒక్కరికే అవకాశం దక్కింది. అదీనూ ఇంగ్లాండ్‌తో తొలి వన్డేలో చోటు దక్కించుకోలేకపోయిన కుల్‌దీప్ యాదవ్ కావడం గమనార్హం. కుల్‌దీప్ 608 పాయింట్లతో తొమ్మిది నుంచి ఎనిమిదో స్థానానికి పడిపోయాడు. నాలుగు వికెట్లు తీసిన అక్షర్ పటేల్ (503) రెండు స్థానాలను మెరుగుపర్చుకుని 42వ ర్యాంక్‌లోకి వచ్చాడు. ప్రసిద్ధ్ కృష్ణ (471) ఏకంగా 9 స్థానాలను దాటి 49వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. బౌలింగ్ విభాగంలో అగ్రస్థానం రషీద్ ఖాన్ (682)దే.

## ఫిఫా వరల్డ్ కప్ నుంచి అర్జెంటీనాను తొలగించాలి..

# వెల్లువెత్తుతున్న నిరసనలు

- అర్జెంటీనా జట్టును ఫిఫా వరల్డ్ కప్ నుంచి తొలగించాలని ప్రపంచవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి.
- ఫిఫా వరల్డ్ కప్ నుంచి అర్జెంటీనాను తొలగించాలి.. వెల్లువెత్తుతున్న నిరసనలు



అర్జెంటీనా జట్టును ఫిఫా వరల్డ్ కప్ నుంచి తొలగించాలని ప్రపంచవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ మేరకు సోషల్ మీడియాలో 75 లక్షలకు పైగా సంతకాల సేకరణ జరగడం ప్రస్తుతం క్రీడా వర్గాల్లో తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. అర్జెంటీనా జట్టు సాధించిన విజయాల పట్ల వ్యతిరేకత, మ్యాచ్‌ల సమయంలో రిఫరీలు తీసుకున్న కొన్ని వివాదాస్పద నిర్ణయాలే దీనికి ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా సూపర్ 16 దశలో ఈజిప్ట్‌తో జరిగిన మ్యాచ్‌లో ఒక పెనాల్టీ నిర్ణయంపై, ఆ తర్వాత క్వార్టర్ ఫైనల్స్‌లో స్విట్జర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆఫ్‌సైడ్ వివాదంపై సోషల్ మీడియాలో భారీ ఎత్తున చర్చ జరుగుతోంది. అర్జెంటీనా జట్టుకు అనుకూలంగా రిఫరీలు పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని, టోర్నమెంట్‌లో వారిని ముందుకు తీసుకెళ్లడానికే ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారని ప్రత్యర్థి జట్ల అభిమానులు ఆరోపించారు.

ఈ క్రమంలోనే https://argentinaout.com/ అనే ప్రత్యేక వెబ్‌సైట్ ద్వారా అర్జెంటీనాను 2026 ఫిఫా ప్రపంచ కప్ నుండి తక్షణమే బహిష్కరించాలంటూ సంతకాల సేకరణను ప్రారంభించారు. ఈ పిటిషన్ ఊహించని రీతిలో వేగంగా వైరల్ అయి, ఏకంగా 75 లక్షల మందికి పైగా సంతకాలు చేయడంతో ఇది కేవలం ఒక ఆన్‌లైన్ నిరసనగా మిగిలిపోకుండా, అంతర్జాతీయ క్రీడా ప్రపంచం దృష్టిని ఆకర్షించిన ఒక పెద్ద వివాదంగా మారింది. అయితే, క్రీడా నిబంధనలు, ఫిఫా (FIFA) నియమాల ప్రకారం ఇలాంటి ప్రజా పిటిషన్లకు ఎలాంటి చట్టపరమైన అర్హత లేదా అధికారిక విలువ ఉండదు. మైదానంలో రిఫరీల నిర్ణయాలే అంతిమమైనవని, వాటిని కేవలం సోషల్ మీడియా నిరసనలు ఆధారంగా మార్చడం, ఒక జట్టును టోర్నమెంట్ నుండి తొలగించడం అసాధ్యమని క్రీడా విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. ఈ ఆరోపణలను అర్జెంటీనా కోచ్ లియోనెల్ స్కలోని పూర్తిగా తోసిపుచ్చారు. టెక్నాలజీ (VAR) ఎంతో అభివృద్ధి చెందిన ప్రస్తుత తరుణంలో ఒక జట్టుకు పక్షపాతంగా వ్యవహరించడం సాధ్యం కాదని, మైదానంలో ఆటగాళ్ల ప్రతిభ వల్లే తాము సెమీస్ చేరామని వారు వాదిస్తున్నారు. ఇక ఇప్పటికే ఫిఫా వరల్డ్ కప్ లో స్పెయిన్ ఫైనల్‌కు చేరగా.. ఇంగ్లాండ్‌తో జరగబోయే కీలకమైన సెమీఫైనల్ పోరుకు అర్జెంటీనా సిద్ధమవుతోంది. ఇందులో గెలిస్తే ఫైనల్ లో స్పెయిన్, అర్జెంటీనా జట్లు కప్ కోసం తలపడనున్నాయి.




# నీ వల్లే నాకు "అయ్యగారు" అనే పేరు వచ్చిందంటూ అభిమాని అఖిల్ హగ్ చేసుకున్నాడు

అక్కినేని అఖిల్ హీరోగా వచ్చిన లేటెస్ట్ మూవీ లెనిన్. ఎన్నో ఏళ్లుగా బిగ్గెస్ట్ హిట్ కోసం ఎదురుచూస్తున్న అఖిల్.. ఈ మాస్ సినిమాతో మంచి సక్సెస్ అందుకున్నారు. జూలై 10వ తేదీన రిలీజ్ అయిన ఈ సినిమా.. ఇండస్ట్రీని షేక్ చేస్తోంది. వారం రోజులు పూర్తయ్యేలోపు రూ.100 కోట్ల కలెక్షన్స్ రాబట్టే దిశగా దూసుకు వెళ్తోంది. ఈ నేపథ్యంలోనే తాజా గుంటూరులో సక్సెస్ మీట్ నిర్వహించారు.

అయితే ఈ సక్సెస్ మీట్ ప్రారంభం కాకముందే.. 'అయ్యగారే నం.1' అంటూ రచ్చ చేసిన డై హార్ట్ అభిమాని నాగరాజును కలిశాడు హీరో అఖిల్. ఈ క్రమంలో అఖిల్ ను హగ్ చేసుకుని నాగరాజు కన్నీళ్లు పెట్టుకున్నాడు. అయితే అతడిని ఓదార్చుతూ... నీ వల్లే తనకు అయ్యగారు పేరు వచ్చిందని అఖిల్ కూడా కాస్త ఎమోషనల్ అయ్యారు. వీళ్ళిద్దరికీ సంబంధించిన వీడియో ఇప్పుడు వైరల్ గా మారింది.

# ఇకపై మామూలు సినిమాలు చేయను..

బాలీవుడ్ యంగ్ బ్యూటీ కృతి సనన్ వరుస విజయాలతో దూసుకుపోతున్నారు. ఇటీవల తేరే ఇష్క్ మే, కాక్టెయిల్-2 వంటి బ్లాక్ బస్టర్ హిట్స్ తన ఖాతాలో వేసుకున్న ఈ భామ మల్టీస్టారర్ మూవీ 'నో ఎంట్రీ సీక్వెల్'లో నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సక్సెస్‌లను ఎంజాయ్ చేస్తున్న కృతి తాజాగా, చేసిన వ్యాఖ్యలు అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాయి. ఇకపై తాను రొటీన్, సేఫ్ జోన్ సినిమాలకు దూరంగా ఉండాలనుకుంటున్నట్లు స్పష్టం చేశారు. భవిష్యత్తులో సరికొత్త ప్రయోగాలు చేస్తూ, సైకలాజికల్‌గా ఎంతో క్లిష్టంగా ఉండే పాత్రల్లో నటించడమే తన లక్ష్యమని వెల్లడించారు. ఓ ఇంటర్వ్యూలో భాగంగా ఆమె తన మనసులోని కోరికను బయటపెట్టారు. ముఖ్యంగా ఒక సైకో పాత్రలో నటించాలనేది తన విష్‌లిస్ట్‌లో టాప్‌లో ఉందని కృతి సనన్ చెప్పారు. నటులుగా మన నిజ జీవితానికి పూర్తిగా భిన్నంగా ఉండే పాత్రలు చేసినప్పుడే అసలైన మజా వస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు. 'అబ్సెషన్' అనే సిరీస్ చూసిన తర్వాత తన ఆలోచనా విధానం పూర్తిగా మారిపోయిందని ఆమె వివరించారు. ఆ సిరీస్ చూస్తున్నప్పుడు, మనం సేఫ్ గేమ్ ఆడటం ఆపేసి, సరికొత్తగా ఆలోచించాల్సిన సమయం వచ్చిందని తనకు అనిపించిందని, అది తనను ఎంతో ఎగ్జైట్ చేసిందని చెప్పారు. అలాగే హాలీవుడ్ నటి జెండయా నటన, ఆమె ఎంచుకునే వైవిధ్యమైన పాత్రలు కూడా తనను ఎంతగానో ఇన్‌స్పైర్ చేశాయని పేర్కొన్నారు. తాను ఎందుకు ఇలాంటి భిన్నమైన పాత్రల వైపు మొగ్గు చూపుతున్నారో చెప్తూ.. తనకు ఒక సైకో అమ్మాయిలా నటించాలని ఉందని చెప్పారు. నటులుగా మనకు సంబంధం లేని ఒక సరికొత్త వ్యక్తిత్వాన్ని స్క్రీన్ మీద ఆవిష్కరించడం, వారి జీవితాన్ని జీవించడం ఎంతో కిక్ ఇస్తుందని అన్నారు. ఇలాంటి సైకలాజికల్ పాత్రల వల్ల ప్రేక్షకులు కూడా సాధారణ జీవితంలో చూడని సరికొత్త కోణాలను, అనుభూతులను స్క్రీన్ పై ఎక్స్‌పీరియన్స్ చేయగలరని కృతి చెప్పుకొచ్చారు. ఇక ఈ విషయం తెలుసుకున్న నెటిజన్లు ఇదేం కోరిక అంటూ భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.





# 14 నెలలుగా వారణాసి కోసం పనిచేస్తున్నాను: ప్రియాంక చోప్రా

రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ హీరోగా భారీ స్థాయిలో తెరకెక్కుతోన్న చిత్రం 'వారణాసి'. మహేశ్‌కు జోడీగా ప్రియాంక చోప్రా మందాకిని పాత్రలో సందడి చేయనున్నారు. తాజాగా ఓ పాడ్ కాస్ట్‌లో ఆమె (Priyanka Chopra) ఈ సినిమా గురించి మాట్లాడారు.

"నేను 14 నెలలుగా ఈ సినిమా కోసం పని చేస్తున్నాను. సినిమాను తెరకెక్కించడానికి రాజమౌళి చాలా సమయం తీసుకుంటారనే సంగతి మనందరికీ తెలిసిందే. ప్రతి సన్నివేశాన్ని క్షుణంగా పరిశీలిస్తారు. ఈ సినిమాలో (Varanasi Movie) నేను అద్భుతమైన స్లో మోషన్ జంప్స్ చాలా చేశాను. ప్రస్తుతానికి నేనింతకంటే ఎక్కువ చెప్పలేను" అని తెలిపారు. ఇటీవల కూడా వారణాసి గురించి ప్రియాంక మాట్లాడారు. తాను ఇప్పటివరకు చేసిన సినిమాలకు ఇది పూర్తి భిన్నమైనదని పేర్కొన్నారు.

ఇప్పటికే ఈ సినిమాలోని కీలక సన్నివేశాల షూటింగ్ పూర్తి చేసినట్లు రాజమౌళి తెలిపారు. అక్టోబరు నాటికి మొత్తం షూటింగ్ పూర్తవుతుందని వెల్లడించారు. ఆ తర్వాత పోస్ట్ ప్రొడక్షన్ పనులు మొదలు పెట్టి, వచ్చే ఏడాది జనవరి లేదా ఫిబ్రవరి నుంచి ప్రమోషన్స్ ప్రారంభించే అవకాశం ఉంది. ఏప్రిల్ 7న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది

PRINTED AT SMILYS ONLINE #6-7-48, SHOPPING COMPLEX, VANSTHALIPURAM,RANGA REDDY, TELANGANA - 500070,
PUBLISHER, EDITOR SHOBHA RANI KASOJU PRGI NO : TGMUL/26/A2874, PHONE NO: 7207282727,7207292727
editor@aashwi.in www.aashwi.net, www.aashwi.in SHOBHA PUBLICATION'S